

ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా రిపబ్లిక్

తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.

ఆసక్తి గలవారు సంప్రదించండి

9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 03 సంచిక -153 | పేజీలు - 8 | వెల ₹03/- | బుధవారం 9 సెప్టెంబర్ 2026

నా వడోదరా అద్భుతం..

ప్రధాని మోదీ భావోద్వేగం

వడోదరా ప్రజలు చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంపై ప్రధాని ప్రశంసలు

స్వచ్ఛతను పండగల స్ఫూర్తితో కొనసాగించాలని ప్రజలకు పిలుపు

వడోదరాను మళ్లీ అపరిశుభ్రం కానివ్వబోమని సంకల్పం తీసుకోవాలన్న మోదీ

పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం

మోదీ కార్యక్రమానికి బుక్‌మైషో ద్వారా రిజిస్ట్రేషన్లు.. గంటలోనే సీట్లు ఫుల్



సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

గుజరాత్‌లోని వడోదరా నగరవాసులపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. తన పర్యటనకు స్వాగతంగా ప్రజలందరూ ఏకమై నగరాన్ని శుభ్రం చేయడానికి చేపట్టిన 'స్వచ్ఛతతో స్వాగతం' కార్యక్రమాన్ని చూసి తన హృదయం గర్వంతో ఉప్పొంగిపోయిందని ఆయన అన్నారు. నేడు మహారాజా

మిగతా 2లో.

చరిత్ర సృష్టిస్తాం

మూడేళ్లలో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.. కాంక్లేవ్‌లో సీఎం



వెలిగొండలో ఈ సీజన్‌లో 10.7 టీఎంసీల నిల్వ

ఎల్‌నినో ప్రభావం ఉన్నా 1000 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలో కలుస్తోంది

అందులో 300 టీఎంసీలు వాడుకున్నా అద్భుతాలు సాధ్యం

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం..

చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరిట దీపాల ప్రదర్శన

అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

మూడేళ్లలో రూ.35వేల కోట్లతో రాష్ట్రంలోని 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి చరిత్ర సృష్టిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ రెండో రోజున ఆయన మాట్లాడారు. "వంశధార, గోదావరి, కృష్ణా, తుంగభద్ర, కావేరి, పెన్నా నదులు అనుసంధానమైతే రిజర్వాయర్లన్నీ నింపుకోవచ్చు. వెలిగొండలో ఈ సీజన్‌లో 10.7 టీఎంసీలు నిల్వ చేసుకుంటున్నాం. వచ్చే ఏడాది 50 టీఎంసీలు నిల్వ చేస్తాం.

మిగతా 2లో.

వాణిజ్యం నుంచి ఏఐ వరకు ఫోకస్

బ్రిక్స్‌లో భారత్ కొత్త ఎజెండా

ప్రపంచ పటాలు పరిశీలించండి -దక్షిణాసియా నెట్‌వర్క్‌లో చేరండి

12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ బ్రిక్స్ సదస్సు

11 సభ్య దేశాలతో విస్తరించిన బ్రిక్స్‌కు భారత్ నాయకత్వం

ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, అభివృద్ధి ఫైనాన్స్‌పైనా చర్చలు

BRICS 2026

న్యూఢిల్లీ : సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

వాణిజ్యం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వరకు బ్రిక్స్ వేదికగా భారత్ తన ఎజెండాను ప్రపంచం ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. బ్రిక్స్ కూటమికి 2026లో అధ్యక్షత వహిస్తున్న భారత్ ఈనెల 12, 13 తేదీల్లో ఢిల్లీలో 18వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనుంది. ఈ సదస్సులో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణం, అంతర్జాతీయ పాలనలో మార్పులపై కీలక చర్చలు జరపనుంది. అదే సమయంలో బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది. సంక్షోభాలను తట్టుకునే ఆర్థిక వ్యవస్థలు,

మిగతా 2లో.

స్పీడ్ బ్రేకర్ లా ఎల్‌నినో

చంద్రబాబు నాయకత్వంలో ఎదుర్కొంటాం: మంత్రి అచ్చెన్నాయుడు

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో 56 శాతం వర్షపాతం లోటు

విపత్కర పరిస్థితుల్లో చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వం అందిస్తున్నారన్న అచ్చెన్న

రైతులను గొడ్డలి పార్టీ నేతలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణ

కూటమి ప్రభుత్వం 46 లక్షల మంది రైతులకు పంటల బీమా కల్పించిందని వెల్లడి

గత ప్రభుత్వం ఐదేళ్లుగా పంటల బీమా ప్రీమియం కూడా చెల్లించలేదని ఆగ్రహం

అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, ఇది అభివృద్ధికి స్పీడ్ బ్రేకర్ లాగా పరిణమించిందని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. అయితే, ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతమైన నాయకత్వంలో ఈ విపత్తును ఎదుర్కొని రైతులకు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. లీడర్‌షిప్ కాన్క్లేవ్‌లో పాల్గొన్న ఆయన, రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రభుత్వ చర్యలపై ప్రసంగించారు.



మిగతా 2లో.

ఉత్తరాంధ్రలో వైసీపీకి షాక్

వైసీపీని వీడిన బొత్స మేనల్లుడు చిన్న శ్రీను

వైసీపీకి రాజీనామా చేసిన చిన్న శ్రీను

వెంటనే చంద్రబాబును కలిసిన వైనం

కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర కూడా టీడీపీలో చేరిన వైనం



విజయనగరం/అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) : ఉత్తరాంధ్రలో వైసీపీకి భారీ షాక్.. మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు

మిగతా 2లో.

కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలు

: మంత్రి నాదెండ్ల మనోహర్

సామాన్యులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు

కిలో ఉల్లిపాయలు రాయితీపై రూ.32కే అందించాలని నిర్ణయం

వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో విక్రయాలు



2లో.



ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై

సస్పెన్షన్ వేటు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలపై చర్యలు తీసుకోవాలని శాసనసభలో తీర్మానం

తీర్మానాన్ని ప్రవేశపెట్టిన మంత్రి దామోదర రాజనర్సింహ

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడమే ఇందుకు కారణం

కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని తీర్మానంలో డిమాండ్

హైదరాబాద్ సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ సమావేశాల కాలం మొత్తం వారిని సస్పెండ్ చేస్తున్నట్లు మండలి ఛైర్మన్ ప్రకటించారు. అసెంబ్లీ స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ తాతా మధు, నవీన్ కుమార్‌లపై కాంగ్రెస్ పక్షం తీవ్ర ఆగ్రహం

మిగతా 2లో.

టెన్షన్.. టెన్షన్

ఎర్రవెల్లి టూ బోయిన్‌పల్లివరకు రాజకీయ కాక

కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను ముట్టడించిన కాంగ్రెస్ నేతలు

అడ్డుకున్న పోలీసులు..(వ్యవసాయ క్షేత్రం చుట్టూ పహారా

కేసీఆర్‌కు రక్షణగా కదిలిన బీఆర్ఎస్ శ్రేణులు

రెండు పార్టీల పరస్పర నిరసనలతో ఉద్రిక్తత

బీఆర్ఎస్ ముఖ్యనేతలను అరెస్టు చేసిన పోలీసులు

పోలీసుల అదుపులో కేటీఆర్, హరీశ్‌రావు,

తదితరులు..సాయంత్రానికి విడుదల

కేసీఆర్ హత్యకు కుట్రలు : కేటీఆర్

పాలక, ప్రతిపక్షాలకు వేర్వేరు నిబంధనలా?: హరీశ్‌రావు



కంటోన్మెంట్/జవహర్‌నగర్ సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బ్లాక్ టీషర్ట్స్‌తో మొదలెట్టిన నిరసన.. అటు ఇటు తిరిగి చివరకు మంగళ వారం కేసీఆర్ ఫామ్‌హౌస్‌ను కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలు ముట్టడించే వరకు వెళ్లింది. ఇరుపార్టీల కార్యకర్తల ఆందోళనలతో ఎర్రవెల్లి రణక్షేత్రంగా మారింది. దళితుడైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రాన్ని ముట్టడించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఎర్రవెల్లికి తరలివచ్చారు. మర్కుక్ మండలం వరదరాజ్‌పూర్ గ్రామం వైపు నుంచి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున ఫామ్‌హౌస్ వైపు కదిలారు. పార్టీ జెండాలు పట్టుకుని, డప్పుల మోతల మధ్య కార్యకర్తలు నినాదాలు చేస్తూ ముందుకు

మిగతా 2లో.

నేడు కోనసీమకు ముఖ్యమంత్రి



అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలో పర్యటించనున్నారు. గ్రౌండ్ రెంట్ భూములకు 22ఏ నుంచి విముక్తి కల్పించిన నేపథ్యంలో లబ్ధిదారులతో సమావేశమవుతారు. నేరుగా వారి నివాసాలకే వెళ్లి ప్రభుత్వ నిర్ణయం గురించి వారికి తెలియజేస్తారు. మాచవరం పంచాయతీ పరిధిలోని జయంతినగర్‌లో రైతులను కలసి ముచ్చటిస్తారు. వారికి పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందజేస్తారు. అనంతరం మాచవరం పండువారిపేటలో ప్రజావేదిక బహిరంగ సభలో ప్రసంగిస్తారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేశ్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షిస్తున్నారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

ఉత్తరాంధ్రలో వైసీపీకి షాక్

మొదటిపేజీ తరువాయి

ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధినేత జగన్ కు పంపించారు. ఈ పరిణామం ఉత్తరాంధ్ర వైసీపీ శ్రేణులకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

మజ్జి శ్రీనివాసరావు తన రాజీనామా లేఖలో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు, తాను నిర్వహిస్తున్న విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి కూడా వైదొలగుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆయన విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. బొత్స కుటుంబానికి అత్యంత సన్నిహితుడిగా, జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించే చిన్న శ్రీను అకస్మాత్తుగా ఈ నిర్ణయం తీసుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.బొత్స సత్యనారాయణ కుటుంబానికి ఉత్తరాంధ్రలో గట్టి పట్టుంది. అలాంటి కీలక నేత మేనల్లుడే పార్టీని వీడటం వైసీపీకి తీవ్ర నష్టంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. జిల్లాలో కీలకమైన జడ్పీ ఛైర్మన్ పదవిలో ఉంటూ, జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నేత రాజీనామా చేయడం వెనుక కారణాలపై పార్టీ వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయితే, తన రాజీనామాకు గల కారణాలను చిన్న శ్రీను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఆయన భవిష్యత్ కార్యాచరణ ఏమిటనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

కిలో ఉల్లిగడ్డలు 32 రూపాయలు

: మంత్రి నాదెండ్ల మనోహర్

అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

ఆంధ్రప్రదేశ్‌లో నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్య ప్రజలకు కూటమి ప్రభుత్వం ఊరట కల్పించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. వంటింటి భారాన్ని తగ్గించే లక్ష్యంతో, కిలో ఉల్లిపాయలను కేవలం రూ.32కే రాయితీపై అందించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం సోషల్ మీడియా ద్వారా వివరాలు వెల్లడించారు.వచ్చే వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 115 రైతు బజార్లు, ప్రత్యేక మొబైల్ కౌంటర్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయల విక్రయాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఉల్లితో పాటు, చౌకధరల దుకాణాల (రేషన్ డిపోలు) ద్వారా రాయితీపై కందిపప్పు, పామాయిల్ కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన పేర్కొన్నారు.బహిరంగ మార్కెట్ ధరలతో పోలిస్తే దాదాపు 30 శాతం తక్కువ ధరకే నాణ్యమైన సరుకులను ప్రజలకు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సహకారం అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు.

ఉత్తరాంధ్రలో వైసీపీకి షాక్

మొదటిపేజీ తరువాయి

రాజీనామా లేఖను పార్టీ అధినేత జగన్‌కు పంపించారు. విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా కూడా ఉన్న ఆయన.. పార్టీ క్రియాశీల సభ్యత్వానికి, పార్టీ పదవులకూ రాజీనామా చేయడమే గాక.. వెంటనే అమరావతి వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి తన కుమార్తెతో పాటు టీడీపీలో చేరడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. 26 ఏళ్ల రాజకీయ చరిత్రలో చిన్న శ్రీను తన మేనమామ బొత్స వద్దే శిష్యరికం చేశారు. ఆయన తర్వాత తానే మంత్రి అన్న తీరుగా వ్యవహరించారు. బొత్స కుటుంబం కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు చిన్నశ్రీనును అందరూ షాడో నేతగా భావించేవారు. పార్టీలో ఎటువంటి పదవీ లేకున్నా అధికార కేంద్రంగా ఉండేవారు. 2014 ఎన్నికల్లో బొత్స కుటుంబం కాంగ్రెస్‌లోనే ఉంది. 2018లో జగన్ ఆహ్వానంతో వైసీపీలో చేరింది. జగన్ పాదయాత్రలో చిన్నశ్రీను ఉత్తరాంధ్రలో అన్నీతానై వ్యవహరించారు. 2021 జడ్పీ ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో ఆయన చైర్మన్‌గా నియమితులయ్యారు. చిన్న శ్రీను చేపట్టిన తొలి అధికారిక పదవి ఇదే. ఈ నెల 24తో పదవీకాలం ముగియనుంది. బుధవారం జడ్పీ సమావేశం ఉందనగా ఆయన రాజీనామా చేయడం విశేషం. బొత్సతో విభేదించి ఆయనీ నిర్ణయం తీసుకున్నారా.. లేకుంటే ఆయన కంటే ముందే వైసీపీ నుంచి బయటకు రావాలని భావించారా అనేది తెలియరాలేదు. ఎందుకంటే గత కొంతకాలంగా బొత్స కుటుంబం మొత్తం వైసీపీకి గుడ్‌బై చెబుతుందన్న ప్రచారం నడుస్తోంది. ఆయన దీనిని ఖండించకపోవడంతో అనుమానాలు పెరుగుతున్నాయి. ఇంతలోనే చిన్నశ్రీను టీడీపీలో చేరి ట్విస్టు ఇచ్చారు.

టెన్షన్.. టెన్షన్

మొదటిపేజీ తరువాయి

సాగారు. 'కేసీఆర్ డౌన్ డౌన్' అంటూ ఎర్రవల్లి పరిసరాలు రాజకీయ నినాదాలతో మార్మోగాయి. కాగా వరదరాజపూర్ చౌరస్తాలో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పోటాపోటీగా రేవంత్‌రెడ్డి, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది.

భారీగా పోలీసుల మోహరింపు

కాంగ్రెస్ కార్యకర్తలు ఫామ్‌హౌస్ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేసి కాంగ్రెస్ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. నిరసనకారులు ముందుకు వెళ్లకుండా పోలీసులు పలు ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించారు.

కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు, పార్టీ శ్రేణులు గజ్వేల్ నుంచి దప్పులతో ఫామ్ హౌస్ వైపు పెద్దఎత్తున బయల్దేరారు. దాంతో పోలీసులు వారిని ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. అలాగే కేసీఆర్‌కు రక్షణగా వెళ్తున్న గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులను సైతం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, శ్రీగిరిపల్లి, గణేష్‌పల్లి, అల్లిరాజ్ పేట్, సింగరాయపల్లి చౌరస్తా, గౌరారం, పాములపర్తిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు ఇరు పార్టీల శ్రేణులను చెదరగొట్టారు.

వాణిజ్యం నుంచి ఏఐ వరకు ఫోకస్

మొదటిపేజీ తరువాయి

కొత్త సాంకేతికత, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధి, ఆ నాలుగు అంశాల చుట్టూ బ్రిక్స్ సదస్సును ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. దీనికి హ్యూమానిటీ ఫస్ట్ అనే దృక్పథాన్ని జోడించింది.బ్రిక్స్‌లో భారత్ ప్రధానంగా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలను తగ్గించడం, అంతర్జాతీయ చెల్లింపులను సులభతరం చేయడం ఇందులో కీలకం. జాతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను మరింత అనుసంధానం చేయడం వంటి అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను మరింత పటిష్టం చేయడం భారత్ ఎజెండాలో ముఖ్యమైన అంశం. అంతేకాక చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా బ్రిక్స్ సహకారం అందించాలనేది లక్ష్యం. ఇందుకోసం ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ విధానం, ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక సహకార పోర్టల్ వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది.

బ్రిక్స్‌లో ఏఐ సహకారానికి ప్రాధాన్యం

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా మార్చుతున్న అంశాల్లో ఏఐ ఒకటి. అందుకే బ్రిక్స్‌లో కూడా ఏఐ సహకారానికి భారత్ ప్రాధాన్యమిస్తోంది. ఏఐతో పాటు ఫిన్‌టెక్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆధారిత వ్యవస్థలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచాలని భావిస్తోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు ప్రత్యేక రిపాజిటరీ ప్రతిపాదన కూడా ఉంది. భారత్‌కు ఇప్పటికే ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యవస్థల్లో అనుభవం ఉంది. ఆ అనుభవాన్ని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడం ద్వారా సాంకేతికతను కేవలం అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితం చేయకుండా గ్లోబల్ సౌత్‌కు అందుబాటులోకి తీసుకురావాలన్నది భారత్ ఆలోచనగా కనిపిస్తోంది.

కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ దేశాల్లోని యువత, స్టార్టప్‌లను అనుసంధానం చేయడంపైనా భారత్ దృష్టి పెట్టింది. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి ప్రతిపాదనల ద్వారా కొత్త సంస్థలకు పెట్టుబడులు, సాంకేతిక సహకారం అందించే ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయంలో కూడా డిజిటల్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాలనేది భారత్ లక్ష్యం. ఏఐ, జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ వ్యవస్థల సాయంతో రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా బ్రిక్స్ సహకారాన్ని పెంచాలని భావిస్తోంది.

ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ రెడ్డిలపై సస్పెన్షన్ వేటు

మొదటిపేజీ తరువాయి

వ్యక్తం చేస్తోంది.

స్పీకర్‌పై అగౌరవంగా మాట్లాడటంతో పాటు, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి దామోదర రాజనర్సింహ శాసనసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత కేసీఆర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కూడా ఆయన డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ, ఎస్సీల చరిత్ర జాతీయ ఆత్మగౌరవంతో ముడిపడి ఉందని, దానిని కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం చేయకూడదని అన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, కానీ రాజ్యాంగబద్ధమైన పదవులను, వ్యవస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంటుందని స్పష్టం చేశారు. "స్పీకర్ పదవి ఏ ఒక్క కులానికో, మతానికో సంబంధించినది కాదు. ఆ అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తిని అవమానించడం క్షమించరాని నేరం" అని ఆయన వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతల అహంకారం తగ్గలేదని, ప్రజాజీవితంలో ఉన్నవారు బాధ్యతాయుతంగా మెలగాలని సూచించారు.

మంత్రి దామోదర ప్రవేశపెట్టిన తీర్మానానికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అసెంబ్లీలో ఈ తీర్మానం ఆమోదం పొందిన అనంతరం, అధికారిక కాపీని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పంపించారు. దీంతో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరు ఎమ్మెల్సీలపై మండలిలో చర్యలు తీసుకున్నారు.

చరిత్ర సృష్టిస్తాం

మొదటిపేజీ తరువాయి

పోలవరంలో ఫేజ్-2 పూర్తితో 190 టీఎంసీల వరకు నిల్వ చేసుకోవచ్చు. బొల్లాపల్లి నిర్మిస్తే 350 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చు. కడప జిల్లాలోని ప్రాజెక్టులతో సుమారు 100 టీఎంసీలు నింపుకొనే అవకాశం ఉంది. నెల్లూరు జిల్లాలో సోమశిల, కండలేరు జలాశయాలున్నాయి. అన్నీ పూర్తిచేసుకుంటే రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో 1,250 నుంచి 1,400 టీఎంసీలు నిల్వ చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. నీళ్లు బయట నుంచి నదుల గుండా రావడం ఎంత ముఖ్యమో, మన ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చడం కూడా అంతే ముఖ్యం. భూగర్భ జలాలు పెరిగితే, విద్యుత్తుకు పెట్టే సబ్సిడీ వ్యయం కూడా తగ్గించవచ్చు. ట్రాన్స్‌మిషన్ ఖర్చులు కూడా తగ్గుతాయి." అని సీఎం తెలిపారు. 'రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గ స్థాయి అభివృద్ధి అనుసంధానం కావాలని కోరారు."నియోజకవర్గ జీడీపీలో విజయవాడ సెంట్రల్, పాలకొల్లు, మండపేట, చిలకలూరిపేట, నెల్లూ రు సిటీ, తణుకు ముందున్నాయి. అభివృద్ధిపై ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెరిగేలా నాయకుల ప్రచార శైలి ఉండాలి. విమర్శలను కూడా సానుకూలంగా మార్చుకుని ప్రజల మద్దతు కూడగట్టాలి. మనం చేస్తున్న అభివృద్ధితో ఓటుబ్యాంకు పెంచుకుందాం. డేటా సెంటర్లకు కావాల్సిన ఐదు టీఎంసీల నీరు అసలు సమస్యే కాదు. పోలవరం ఎడమకాలువ ద్వారా రోజుకు 2 టీఎంసీలు తీసుకెళ్లే అవకాశం ఉంది. డేటా సెంటర్ల ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు వస్తాయి. లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర జీఎస్డీపీ రూ.20.35 లక్షల కోట్లుగా ఉంది. 15-20 రంగాల్లో జీఎస్డీపీని పెంచేలా నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలి. ఎల్‌నినో ప్రభావం ఉన్నప్పటికీ గోదావరి నుంచి ఈ ఏడాది 1000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా వెళ్లింది. అందులోంచి 300 టీఎంసీలు వాడుకున్నా అద్భుతాలు సృష్టించవచ్చు." అని తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు రావాలి..

"సంపద సృష్టికి డబ్బులు లేవని కూర్చుంటే సరిపోదు. ఆలోచన చేస్తే పరిష్కారం లభిస్తుంది. రాష్ట్రాన్ని దేశంలో నం.1గా అభివృద్ధి చేయడమే లక్ష్యం. ఆలోచన మారితే ప్రతి ప్రాంతాన్నీ అభివృద్ధి చేసుకోవచ్చు. కుప్పం సమీపం నుంచి వెళ్తున్న జాతీయ రహదారికి దగ్గర్లో ఓ పారిశ్రామిక ప్రాంతాన్ని సృష్టించాం. రూ.30 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించాం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ప్రాజెక్టులు అంతే వేగంగా ఏర్పాటయ్యేలా చూడాలి. 'పౌరసేవలు అందించడంలో కొన్ని నియోజకవర్గాలు మంచి ఫలితాలను సాధిస్తున్నాయి. అన్ని నియోజకవర్గాలూ ఉత్తమ కార్యాచరణ పద్ధతులను అమలు చేయాలి. ఏడాదికి రూ.1000 కోట్ల ఆదాయం వస్తున్నా వదులుకుని, ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నాం. ఎక్కడైనా ఉచిత ఇసుక ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోండి.."

ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం..

"ఎల్‌నినో వల్ల రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అంతా కలిసి దీనిని సమర్థంగా ఎదుర్కోందాం. రాష్ట్రంలో ఇప్పటిదాకా 54 శాతం లోటు వర్షపాతం నమోదైంది. రిజర్వాయర్లలో గత ఏడాది ఇదే సమయానికి 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి మాత్రం 530 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయి. కొన్ని జిల్లాల్లో వేయాల్సిన దానికంటే ఎక్కువగా పంటలు వేశారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే 177 శాతం పంటలు వేశారు. తిరుపతి జిల్లాలో 158 శాతం, కోనసీమలో 103 శాతం, పశ్చిమ గోదావరిలో 99 శాతం పంటలు వేశారు. మార్కాపురంలో 21, పోలవరంలో 20, ప్రకాశం జిల్లాలో 12 శాతం మాత్రమే పంటలు వేశారు. వ్యవసాయ, ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తునే సాగు చేశారు. గోదావరి నీటిని తరలించి కృష్ణా డెల్టాలో పంటలను కాపాడుకోగలిగాం. పట్టిసీమ ద్వారా 36 టీఎంసీల నీరు ప్రకాశం బ్యారేజీకి తరలించాం. ఈ సీజన్‌లో ఈ ప్రాంతానికి మరో 71 టీఎంసీలు అవసరం. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యం. పశువులకు కూడా నీటి కొరత లేకుండా కాపాడుకుంటాం. పరిశ్రమలకు లోటు లేకుండా కార్యాచరణ చేపడతాం. ఉద్యాన పంటలూ కాపాడుకునేలా చర్యలు చేపట్టాం. పంటల బీమా పెద్దఎత్తున చేశాం. వర్షాభావంతో కర్నూలు, నంద్యాల తదితర ప్రాంతాల్లోని రైతులు పూర్తిగా నష్టపోయారు. వైవిధ్య పంటల దిశగా అవగాహన కల్పించాలి. రాష్ట్రంలో ప్రతి ఎకరంలో సాగు చేసేందుకు పీఎండీఎస్ విధానం చేపట్టాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు ఆస్కారం ఉంది. 25 లక్షల ఎకరాల్లో ఈ తరహా విధానం అనుసరించాలని రైతులకు పిలుపునిస్తున్నా. వివిధ నియోజకవర్గాల్లో పీఎండీఎస్ విధానంలో విత్తనాలను చల్లించాలని కోరుతున్నా. గత పాలకులు సాగునీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి, ఇప్పుడు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలోకి వాస్తవాలను తీసుకెళ్లి కౌంటర్ చేయాలి. ప్రజల్లో విశ్వాసం కల్పించేలా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇన్‌చార్జి మంత్రులు నిరంతరం మాట్లాడాలి. సాధారణ పరిస్థితులు వచ్చే వరకూ ఎల్‌నినోపైనే కేంద్రీకరించాలి" అని సీఎం పిలుపునిచ్చారు.

చంద్రబాబు అక్రమ అరెస్టుకు మూడేళ్లు

నేడు రాష్ట్రవ్యాప్తంగా 'నిజం గెలిచింది' పేరిట దీపాల ప్రదర్శన

టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్ట్ చేసి బుధవారంతో మూడేళ్లు పూర్తి అవుతాయని మంత్రి లోకేశ్ తెలిపారు. "అర్ధరాత్రి అక్రమంగా అరెస్ట్ చేసి రోడ్డు మార్గంలో ఆయనను నాడు కోర్టుకు తీసుకెళ్లారు. 53 రోజుల పాటు అక్రమంగా జైల్లో బంధించారు. ఆయనకు కోర్టు, ఈడీ క్లీన్ చిట్ ఇచ్చాయి. రేపు 'నిజం గెలిచింది' పేరుతో పార్టీ కార్యాలయాలు, ఇళ్లు, బూత్ లెవల్ లో 53 దీపాలు వెలిగిద్దాం. చంద్రబాబు అక్రమ అరెస్టును బ్లాక్ డే గా పాటిద్దాం." అని వెల్లడించారు.

ముగిసిన టీడీపీ కాంక్లేవ్

టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్ ముగిసింది. రెండో రోజు సమావేశంలో ఐదు అంశాలపై నాయకులు సుదీర్ఘంగా చర్చించారు. సస్టెయినబుల్ డెవల్‌పమెంట్ అంశంపై ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు బొండా ఉమ, కూన రవికుమార్ .. ప్రభుత్వ సేవలు, పాలనా విధానంపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి.. నియోజకవర్గ అభివృద్ధి ప్రజలకు చేరడం, నాయకుడి ఎదుగుదలపై ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ.. పీ4పై ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి.. రాజకీయ ప్రచారం, ప్రజా సంబంధాలు అనే అంశంపై మంత్రి నిమ్మల రామానాయుడు.. ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కోవడంపై మంత్రి అనిత మాట్లాడారు.

ఇమేజ్ పెంచుకోండి

"నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యలను స్వయంగా చొరవ తీసుకుని పరిష్కరించాలి. దానివల్ల ఎమ్మెల్యేలకు ఇమేజ్ పెరుగుతుంది. నివాసం ఉంటూ, అభ్యంతరాల్లేని చోట ఇళ్ల పట్టాలు అందించి క్రమబద్ధీకరిస్తాం. ఓ నాయకుడు ఎన్నిసార్లు వీలైతే అన్ని సార్లు ప్రజలకు దగ్గరవ్వాలి. కనీసం వాయిస్ మెసేజ్ ద్వారా ఆయినా చేరువ కావాలి. ప్రజల సమస్యల పట్ల మానవత్వంతో స్పందిస్తే వారిలో సానుకూల దృక్పథం కలుగుతుంది. ఆర్టీజీఎస్ ద్వారా పబ్లిక్ గ్రీవెన్సులను పూర్తిస్థాయిలో పరిష్కరించేలా చూడాలి. రూఫ్ టాప్ సోలార్‌పై అంతా దృష్టి పెట్టాలి. ల్యాండ్ రికార్డులన్నీ 2027 మార్చి నాటికి ప్రక్షాళనైతే, భూ వివాదాలు ముగిసిపోతాయి. రియల్ టైమ్ నిర్ణయాలతో జెన్‌జీ దూకుడు ప్రదర్శిస్తోంది. జెన్‌జీ ఆలోచనల్ని కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలి. గత సమావేశంలో నియోజకవర్గాల్లో పరిష్కరించాల్సిన అంశాలను ఎమ్మెల్యేలు లేవనెత్తారు. వీటిపై సమీక్షించి 175 నియోజకవర్గాల్లో రూ.20,400 కోట్ల విలువైన 616 పనులను మంజూరు చేశాం."

స్పీడ్ బ్రేకర్ లా ఎల్‌నినో

మొదటిపేజీ తరువాయి

ఎల్‌నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 56 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని జిల్లాల్లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉందని, అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశంలో 70 శాతం, చిత్తూరులో 65 శాతం, విశాఖపట్నంలో 60 శాతం వర్షపాతం లోటు ఉందని గణాంకాలతో సహా వివరించారు. రాష్ట్రంలోని 680 మండలాల్లో వర్షాలు లేక కరవు ఛాయలు అలుముకున్నాయని తెలిపారు. అయితే, ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి గత ఏడాదే చెరువులను నింపడం వంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు.

ఈ కష్టకాలంలో కొందరు 'గొడ్డలి పార్టీ' నాయకులు రైతులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అచ్చెన్నాయుడు విమర్శించారు. గతంలో పట్టిసీమను వ్యతిరేకించి, ఐదేళ్ల పాటు ఉచిత పంటల బీమా అని చెప్పి కనీసం ప్రీమియం కూడా చెల్లించని వారు ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 46 లక్షల మంది రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించిందని, ఇప్పటికే రూ.4,800 కోట్లు బీమా చేశామని స్పష్టం చేశారు.

27 నెలల క్రితం అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నమైన రాష్ట్రాన్ని చంద్రబాబు మళ్లీ గాడిన పెట్టారని అచ్చెన్నాయుడు కొనియాడారు.గతంలో రాజమండ్రి సూపర్ సైక్లోన్, శ్రీకాకుళంలో తితిలి తుపాను వంటి భయంకరమైన విపత్తులను చంద్రబాబు సమర్థంగా ఎదుర్కొన్నారని అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. 30 ఏళ్ల క్రితమే నీటి సమస్యపై ఆయన దృష్టి సారించారని, 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టులపై రూ.65 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. 2019లో టీడీపీ గెలిచి ఉంటే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు వాస్తవాలు గ్రహించి రైతులకు ధైర్యం చెప్పాలని ఆయన సూచించారు.

నా వడోదరా అద్భుతం..

మొదటిపేజీ తరువాయి

సయాజీరావ్ యూనివర్సిటీలో జరిగిన 'నమో 4 వికసిత్ భారత్' కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "నిన్న నేను ఒక వీడియో చూశాను. నా వడోదరాను చూసి నా ఛాతీ గర్వంతో ఉప్పొంగిపోయింది. అద్భుతం!" అంటూ నగర ప్రజల భాగస్వామ్యాన్ని కొనియాడారు. తన పర్యటనకు ముందు నగరం మొత్తం ఒక ప్రజా ఉద్యమంలా మారి శుభ్రత కార్యక్రమాలు చేపట్టడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం వడోదరాలోని ప్రతి కుటుంబంలో స్వచ్ఛతపై సరికొత్త వాతావరణాన్ని సృష్టించిందని పేర్కొన్నారు.

ఈ స్వచ్ఛతా స్ఫూర్తిని రాబోయే పండుగలైన గణేశ్ చతుర్థి, నవరాత్రి, దీపావళి వరకు కొనసాగించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. "ఈసారి గణపతి వచ్చినప్పుడు, ఆయన ఆశీస్సులన్నీ వడోదరాపైనే కురుస్తాయని నేను భావిస్తున్నాను" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ పరిశుభ్రతా కార్యక్రమాన్ని కేవలం తాత్కాలికంగా కాకుండా, శాశ్వత పౌర నిబద్ధతగా మార్చుకోవాలని సూచించారు.

"ఇప్పుడు మనం ఒక సంకల్పం తీసుకుందాం. వడోదరాను మళ్లీ అపరిశుభ్రంగా మారకుండా చూసుకుందాం" అని గుజరాతీలో ప్రజలను కోరారు.

ప్రధాని మోదీ తన పర్యటనలో భాగంగా రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో వెస్టర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ (డబ్ల్యూడీఎఫ్‌సీ), కొత్త రైల్వే సేవలు, జాతీయ రహదారుల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, నీటి సరఫరా వంటివి ఉన్నాయి. వడోదరా మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ స్వచ్ఛతా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యాసంస్థలు, ఎన్జీవోలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో భాగంగా 20 లక్షల మొక్కలను పంపిణీ చేసినట్లు తెలిపారు. కాగా, మోదీ కార్యక్రమానికి 'బుక్‌మైషో' ద్వారా ఉచిత రిజిస్ట్రేషన్లు నిర్వహించగా, గంటలోనే అందుబాటులో ఉన్న సీట్లన్నీ నిండిపోవడం, మరో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉండటం విశేషం.



గుంతకల్లు మున్సిపల్ ఎన్నికలే వైఎస్సార్‌సీపీ లక్ష్యం!

పార్టీ శ్రేణులకు వైవీఆర్ దిశానిర్దేశం.. వార్డుల వారీగా పార్టీ బలోపేతంపై దృష్టి

గుంతకల్ సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)

రాబోయే మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గుంతకల్లు మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ గుంతకల్లు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి వై. వెంకటరామిరెడ్డి (వైవీఆర్) పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందుగానే క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు.

మంగళవారం వైవీఆర్ క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆశావహ అభ్యర్థులతో ప్రత్యేకంగా దిశానిర్దేశ సమావేశం నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, వార్డుల వారీగా పార్టీ పరిస్థితి, ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఈ సందర్భంగా వై. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని అన్నారు. ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ ఇప్పటి నుంచే వార్డుల వారీగా ప్రజల్లోకి వెళ్లి పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు.

వార్డులపై ప్రత్యేక దృష్టి

ప్రతి వార్డులో పార్టీ పరిస్థితిని సమీక్షించుకోవడంతో పాటు



స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని బలోపేతం చేయాలని వైవీఆర్ సూచించారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై పార్టీ తరఫున స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం, స్థానిక సంస్థల పరంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి ఉన్న ఆశావహ అభ్యర్థులు ఇప్పటి నుంచే ప్రజలతో మమేకం కావాలని అన్నారు. వార్డులోని ప్రతి కుటుంబంతో సంబంధాలు పెంచుకోవడంతో పాటు పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఆశావహులు తమ వార్డుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే విధంగా పనిచేయాలని సూచించారు.

ఐక్యంగా పనిచేస్తే విజయం ఖాయం

పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో ఐక్యంగా పనిచేస్తే గుంతకల్లు మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని వై. వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. వ్యక్తిగత విభేదాలకు తావివ్వకుండా పార్టీ విజయమే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ప్రతి వార్డును సమన్వయంతో పర్యవేక్షిస్తూ పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని సూచించారు.

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి అవసరమైన అన్ని స్థాయిల్లో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

గుత్తి సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు) నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

పి.డి.ఎస్.యు గుత్తి మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు గుంతకల్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పి.వి. అఖిల్, వి. వినోద్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర



ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్నాయని, కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం, వసతి వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ. 3 వేలకు, కాస్మోటిక్ చార్జీలను రూ. 300కు పెంచాలని కోరారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ప్రభుత్వ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించేందుకు నిధులు కేటాయించాలని అన్నారు.

పీజీ విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిన జీవో నెం. 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో పి.డి.ఎస్.యు గుంతకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు వై. రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యుడు బి. రాజేష్, గుత్తి మండల అధ్యక్షుడు ఎం. తన్వీర్, నాయకులు మంజు, సాయి, గణేష్, కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్యూస్పైడర్స్ జాబ్ డ్రైవ్‌లో 27 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

కర్నూలు కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహణ.. : రూ.3 నుంచి 9.5 లక్షల వార్షిక ప్యాకేజీలు






కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)

క్లస్టర్ యూనివర్సిటీ కర్నూలుకు అనుబంధంగా ఉన్న కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థుల కోసం బెంగళూరుకు చెందిన క్యూస్పైడర్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థ జాబ్ డ్రైవ్ నిర్వహించింది. ఈ సంస్థ టెస్ట్ యంత్ర సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్‌గా పనిచేస్తోంది. జాబ్ డ్రైవ్‌కు మొత్తం 114 మంది విద్యార్థులు హాజరుకాగా, వారిలో 104 మంది గ్రూప్ డిస్కషన్ రౌండ్‌కు ఎంపికయ్యారు. అనంతరం నిర్వహించిన తుది ఎంపిక ప్రక్రియలో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు వారి విభాగాలను బట్టి ఏటా రూ. 3 లక్షల నుంచి రూ. 5.5 లక్షలు, రూ. 5.5 లక్షల నుంచి రూ. 9.5 లక్షల వరకు ప్యాకేజీలు లభించనున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. భారతి, క్లస్టర్ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎల్. నాగరాజు, కేవీఆర్ జేకేసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె. కల్పన, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంతటి చక్కటి ఉద్యోగ అవకాశాన్ని కల్పించిన క్యూస్పైడర్స్ సంస్థ ప్రతినిధులకు కళాశాల ప్రిన్సిపల్, జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ఉపాధ్యాయుల సేవలకు ఘన సత్కారం







శ్రీ సత్యసాయి ప్రతినిధి, సెప్టెంబర్ 08.(రిపబ్లిక్ న్యూస్):

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని హైకోర్టు న్యాయవాది, బహుజన చైతన్య వేదిక నాయకుడు బీసీవీ శివరామకృష్ణ పేర్కొన్నారు. పరిగి మండల కేంద్రంలోని లింగన్న సేవామందిర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 202526 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు 593 మార్కులు సాధించి ఉమ్మడి జిల్లాల స్థాయిలో ప్రతిభ కనబర్చడాన్ని పురస్కరించుకుని పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల బోధన, నిరంతర కృషి దోహదపడిందని నిర్వాహకులు పేర్కొన్నారు. పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 22 మంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులను బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేవీ మహేష్, ఏఎస్ఐ, ఉపాధ్యాయుల సేవలను ప్రశంసించారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి, వారిని ఉన్నత లక్ష్యాల వైపు నడిపించడంలో ఉపాధ్యాయుల బాధ్యత ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా బీసీవీ శివరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతలను నేర్పడంలో ఉపాధ్యాయుల పాత్ర ప్రత్యేకమైనదన్నారు. విద్యార్థులు సాధించే విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి గౌరవించడం సమాజ బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, బహుజన చైతన్య వేదిక రాయలసీమ అధ్యక్షుడు చల్లాపల్లి ఈశ్వర్, గౌరవ సలహాదారు రంగేపల్లి కదిరప్ప, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రామాంజినప్ప, కౌన్సిలర్ మారుతి, రిటైర్డ్ వీఆర్వో గోవిందప్ప, పరిగి మండల నాయకులు నరేష్, కిష్టప్ప, నర్సింలు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి నిర్వహించాలి



గుత్తి, సెప్టెంబరు 8: (రిపబ్లిక్ న్యూస్)

వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించుకోవాలని గుత్తి తహసీల్దార్ పుణ్యవతి, సీఐ రామారావు సూచించారు. మంగళవారం గుత్తి రెవెన్యూ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద అగ్ని ప్రమాదాలు, అల్లర్లు తదితర ఘటనలు చోటుచేసుకోకుండా కమిటీ సభ్యులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. భక్తిశ్రద్ధలతో పండుగను సంతోషంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బేతాపల్లి పీహెచ్‌సీలో రికార్డుల పరిశీలన

గుత్తి సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)



బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, వాటికి సంబంధించిన రికార్డులను బెంగళూరు నుంచి వచ్చిన కేంద్ర బృందం పరిశీలించింది. సీబీహెచ్ఐ డిప్యూటీ డైరెక్టర్ జి. రామచంద్రరావు, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ విష్ణుమూర్తి, ఎస్ఓ ఎస్. మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలోని బృందం పీహెచ్‌సీలో తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ప్రజలకు అందిస్తున్న సేవలకు సంబంధించిన వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. ముఖ్యంగా ఓపీ సేవల రిజిస్టర్లు, ఆసుపత్రిలోనే రోగుల రిజిస్టర్లు, ల్యాబొరేటరీ సేవలు, డయాలసిస్, డయాబెటిస్, గర్భ పరీక్షల రిజిస్టర్లు, టీబీ రిజిస్టర్లు, బ్లడ్ కల్చర్ రిజిస్టర్లు, యూరిక్ యాసిడ్, యూరిన్ ప్రోటీన్ రిజిస్టర్లను తనిఖీ చేశారు.

అలాగే హెచ్ఎంఐఎస్, కమ్యూనికబుల్ డిసీజెస్, నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్‌కు సంబంధించిన రికార్డులతో పాటు స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులకు సంబంధించిన రిజిస్టర్లను కూడా పరిశీలించారు. ఆయా రికార్డుల్లో నమోదైన వివరాల ఆధారంగా ప్రజలకు అందించిన వైద్య సేవల నాణ్యత, గుణాత్మకతను పరిశీలించారు. సేవలకు సంబంధించిన వివరాలు డిజిటలైజేషన్ అప్లికేషన్‌లో నమోదు చేసిన విధానాన్ని కూడా బృందం పరిశీలించింది. అనంతరం సేవల మెరుగుదలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, పాటించాల్సిన అంశాలపై సిబ్బందికి తగిన సూచనలు, నిర్ణయాత్మక మార్గదర్శకాలను బృంద సభ్యులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ దేవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ మండపానికి పోలీస్ ముందస్తు అనుమతి తప్పనిసరి

మట్టి వినాయకుడు విగ్రహాలను ప్రతిష్టించండి -చిప్పగిరి ఎస్సై సి.వెంకట నరసింహులు



చిప్పగిరి, సెప్టెంబర్, 8, (రిపబ్లిక్ న్యూస్) గణేష్ మండపానికి పోలీసులు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని చిప్పగిరి ఎస్ఐ సి. వెంకట నరసింహులు మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు గ్రామ పెద్దలు మరియు ప్రజలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు, మాట్లాడుతూ మండపాలు ట్రాఫిక్ అభ్యంతరం కలిగించేలా ఉండకూడదని, వినాయకుడి విగ్రహాల తరలింపులు ఊరేగింపు, మరియు నిమజ్జనం సమయంలో మద్యం సేవించడం పూర్తి నిషేధమని, మద్యం సేవించి వచ్చే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అలాగే మట్టి వినాయకుడు విగ్రహాలను ప్రతిష్టించాలని సూచించారు, ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ ప్రాణాలకు ఏం జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం



హత్నూర, సెప్టెంబర్ 26, (రిపబ్లిక్ న్యూస్): సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం కొన్యాల గ్రామం నుండి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు మరణాన్ని కోరడాన్ని ఖండిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ, కెసిఆర్ కు క్షమాపణ బహిరంగ చెప్పాలని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పై కఠిన చర్యలు తీసుకొని వెంటనే కేసు నమోదు చేయాలని హత్నూర మండలంలోని పోలీస్ స్టేషన్లో కెసిఆర్ కు రక్షణ కల్పించాలని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భగవాన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు జుట్టు నారాయణ, జుట్టు వెంకటేశం, లచ్చన్న మాధవరెడ్డి, ఏర్పుల సురేష్, హత్నూర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

రేణిగుంట కరకంబాడి లో ఘనంగా కట్ట పుట్టాలమ్మ జాతర ప్రారంభం...



రేణిగుంట సెప్టెంబర్ :8 (రిపబ్లిక్ న్యూస్)

రేణిగుంట మండల పరిధిలోని కరకంబాడిలో వెలసి ఉన్న శ్రీ శ్రీ శ్రీ కట్ట పుట్టాలమ్మ దేవాలయంలో జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని రమణీయంగా అలంకరించారు. స్థానిక ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి దండాలు సమర్పించి, మొక్కులు తీర్చుకుంటూ అత్యంత భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ పాడి రాజేంద్ర, కరకంబాడి క్లస్టర్ ఇన్‌ఛార్జ్ బుజ్జి నాయుడు మాట్లాడుతూ.. ఏటా నిర్వహించే ఈ జాతరకు భారీగా భక్తులు తరలివస్తారని తెలిపారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా వాహనాల పార్కింగ్, పోలీస్ బందోబస్తు చర్యలు పక్కాగా చేపట్టినట్లు వెల్లడించారు. అలాగే అత్యవసర వైద్య సేవల కోసం హెల్త్ డిపార్ట్‌మెంట్ సౌజన్యంతో ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ మహోత్సవాల్లో రాజకీయాలకు తావులేదని, భక్తులందరూ కలసికట్టుగా పాల్గొనాలని కోరారు. బుధవారం పవిత్ర 'నాగ హారతి' ఈ జాతరలోనే అత్యంత అపురూపమైనది, పవిత్రమైనదైన 'నాగ హారతి' కార్యక్రమం దొడ్లమెట్ట వద్ద రాబోయే బుధవారం రోజున అత్యంత వైభవంగా జరుగుతుందని నిర్వాహకులు వెల్లడించారు. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భక్తులందరూ విశేషంగా పాల్గొని, ఆధ్యాత్మిక శోభతో విలసిల్లే ఈ పూజలో భాగస్వాములై శ్రీ కట్ట పుట్టాలమ్మ అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని వారు పిలుపునిచ్చారు

బాల్య వివాహాలపై అవగాహన





కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)
మంగళవారం 08.09.26 జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారిని పి.విజయ ఆదేశాల మేరకు, నగరం లోని ఇందిరాగాంధీ మెమోరియల్ హై స్కూల్ నందున విద్యార్థులకు వన్ స్టాప్ సెంటర్ సర్వీసెస్, రేష్మ మాట్లాడుతూ అమ్మాయికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే అబ్బాయికి 21 సంవత్సరములు దాటిన తర్వాతనే వివాహం జరిపించాలి లేనియెడల తల్లిదండ్రులకు పెళ్లి నిర్వహణకు మద్దతుదారులకు వంట మనుషులకు పురోహితులకు టెంట్ హౌస్ వారికి కళ్యాణ మండపం వారికి బ్యాండ్ మేళం వారికి వంట మనుషులకు శిక్షకు అర్హులు దీనికిగాను రెండు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానం విధించును. బాల్య వివాహం మీకు తెలిసిన మీ గ్రామంలో గాని మీ పట్టణంలో గాని మీ బంధువుల మిత్రులను వివాహం జరిపించి నట్లు మీకు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్.181,1098,14416,1930 పై నంబర్లకు సమాచారం ఇవ్వగలరని సూచించారు అని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ కర్నూలు సిబ్బంది వి.జ్యోత్స్న కేసు వర్కర్, పార మెడికల్ పి.రేష్మ మరియు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే వైఎస్సార్సీపీ శ్రేణులు సిద్ధం కావాలి

ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాడాలి: ఎస్వీ మోహన్ రెడ్డి







కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్సీపీ శ్రేణులు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నియోజకవర్గ సమన్వయకర్త ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల తరపున బలమైన గొంతుకగా నిలవాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.
వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఎస్వీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్ సెకండ్ ఫ్లోర్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడం, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు.
ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం సమష్టిగా పోరాడాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీల అమలు తీరుపై ప్రజల్లో విస్తృతంగా చైతన్యం కల్పించాలన్నారు. హామీలకు, వాటి అమలుకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు.నిరుద్యోగుల సమస్యలు, డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణలు, రైతులకు గిట్టుబాటు ధరలు, పెట్రోల్‌డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల వంటి ప్రజా సమస్యలపై వైఎస్సార్సీపీ శ్రేణులు విస్తృతంగా పోరాడాలని అన్నారు.
వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఎస్వీ మోహన్ రెడ్డి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.
ప్రముఖుల హాజరు: నంద్యాల జిల్లా పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, వైఎస్సార్సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్వీ విజయ మనోహరి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ ఎర్రకోట రాజీవ్ రెడ్డితో పాటు పార్టీ జిల్లా నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

హంద్రీనీవాలో మూడు ప్రాంతాల్లో నిమజ్జనానికి అవకాశం: మంత్రి టీజీ భరత్

ప్రస్తుత పరిస్థితిని ప్రజలకు వివరించిన మంత్రి



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)
వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా హంద్రీనీవాలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సుంకేసులలో నీటి లభ్యత లేకపోవడంతో ప్రస్తుతం కేఎసీవీ కెనాల్‌కు నీటిని విడుదల చేసే పరిస్థితి లేదని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు.
ఈ నెల 2వ తేదీన అధికారులు నిర్వహించిన సమీక్షలో సెప్టెంబర్ 14వ తేదీ వరకు మాత్రమే హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉంటుందని, చిన్న విగ్రహాలను మాత్రమే నిమజ్జనం చేసేందుకు వీలుంటుందని తెలిపారని మంత్రి గుర్తు చేశారు. అయితే తాజాగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం మరో 12 నుంచి 14 రోజుల వరకు హంద్రీనీవాకు నీటిని తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు వెల్లడించారని తెలిపారు.పెద్ద విగ్రహాలను సైతం నిమజ్జనం చేసుకునేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తామని అధికారులు తెలిపినట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రతిష్టించిన తర్వాత 5వ రోజు, 7వ రోజు, 9వ రోజు హంద్రీనీవాలో అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా 5వ, 7వ రోజుల్లో నీటి లభ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నిమజ్జనానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. 9వ రోజు పరిస్థితి ఎంతమేర అనుకూలంగా ఉంటుందో ఇప్పుడే ఖచ్చితంగా అంచనా వేయలేమని స్పష్టం చేశారు.
నన్నూరు టోల్‌గేట్, తడకనపల్లె, ఉలిందకొండ ప్రాంతాల్లో హంద్రీనీవాలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏదో ఒక ప్రాంతాన్ని వినాయక నిమజ్జన కమిటీ ఎంపిక చేసి తెలియజేస్తే, గతంలో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిమజ్జన సమయంలో చేసిన విధంగానే ఈ ఏడాది కూడా ఎంపిక చేసిన ప్రాంతంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.
ప్రజలు ఒక అడుగు నుంచి అడుగున్నర ఎత్తు వరకు ఉన్న మట్టి విగ్రహాలను మాత్రమే ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. చిన్న విగ్రహాలను ఇంటి వద్దే నిమజ్జనం చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పెద్ద విగ్రహాలను మాత్రం వినాయక నిమజ్జన కమిటీ, అధికారులు ఎంపిక చేసిన ప్రాంతంలో నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.

వర్షాల కోసం వరుణ యాగం

వర్షాలు సమృద్ధిగా కురవాలని దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వరుణ యాగం నిర్వహించాలనే అంశంపై క్యాబినెట్ సమావేశంలో చర్చించినట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. కర్నూలులో గాయత్రి గోసేవ సమితి ఆధ్వర్యంలో వరుణ యాగం నిర్వహించనున్నట్లు చెప్పారు.
వర్షాలు కురిసి సుంకేసులకు నీరు చేరితే కేఎసీవీ కెనాల్‌కు నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని, అప్పుడు కేఎసీవీ కెనాల్‌లోనూ వినాయక నిమజ్జనం చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో కేఎసీవీ కెనాల్‌లో నిమజ్జనానికి అవకాశం లేదని ప్రజలు అర్థం చేసుకుని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.


ఓర్వకల్ మండలంలోని బ్రహ్మణపల్లి, శకునాల గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమం





ఓర్వకల్లు ప్రతినిధి, సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)
కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని శకునాల గ్రామం మరియు బ్రహ్మణపల్లి గ్రామాలలో రైతులకు వివిధ వ్యవసాయ పథకాలు, రైతు ఐడీ, రైతు పెన్షన్ పథకం మరియు సమగ్ర సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రైతులకు ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన గురించి వివరించారు. 18 నుండి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అర్హత గల రైతులు సమీపంలోని జూజ కేంద్రాల ద్వారా ఆధార్ నంబర్ మరియు గ్రావీ-ఖ×ూూచీకు అనుసంధానమైన బ్యాంకు ఖాతా వివరాలతో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. రైతుల వయస్సును బట్టి నెలకు సుమారు రూ.55 నుండి రూ.200 వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని, 60 సంవత్సరాల వయస్సు పూర్తయిన తరువాత అర్హత మేరకు నెలకు రూ.3,000 పెన్షన్ పొందే అవకాశం ఉంటుందని వివరించారు.అలాగే, రైతులకు (రైతు ఐడీ) ప్రాధాన్యతను వివరించారు. రాబోయే కాలంలో ప్రభుత్వం అమలు చేసే వివిధ వ్యవసాయ సంక్షేమ పథకాలు, ఎరువుల కొనుగోలు, పంటల నమోదు, పంట బీమా మరియు ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు పొందేందుకు రైతు ఐడీ ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఐడీ నమోదు చేసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా Reliance Foundation ద్వారా రైతులకు అందిస్తున్న వేపనూనె, అమినో ఆమ్లాలు, ఫెరోమోన్ ట్రాప్స్, స్టిక్కీ ట్రాప్స్ వంటి వ్యవసాయ ఇన్‌పుట్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీటి ద్వారా పంటలపై పురుగు ఉధృతిని గుర్తించడం, నియంత్రించడం, రసాయనిక పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం మరియు సమగ్ర సస్యరక్షణ పద్ధతులను అవలంబించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.రైతులు వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని, శాస్త్రీయ మరియు సమగ్ర పంట నిర్వహణ పద్ధతులను అవలంబించాలని మండల వ్యవసాయ అధికారి, ఓర్వకల్ కోరారు.

కల్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ను సందర్శించిన శీలం వెంకట శేషాద్రి కమ్ సివిల్ జడ్జ్





కల్లూరు ప్రతినిధి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) కర్నూలు జిల్లా కల్లూరు మండలం లోప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా, లీల వెంకట శేషాద్రి సెక్రటరీ కమ్ సివిల్ జడ్జ్ జిల్లా పరిషత్ హై స్కూల్ కల్లూరును సందర్శించడం జరిగింది. విద్యార్థులకు చదువు యొక్క విలువను విద్య యొక్క గొప్పదనాన్ని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారు మొక్కలు నాటడం మరియు సమాజంలో ఆడపిల్లలు ఎలా నడుచుకోవాలి అన్న అంశాలను తెలియచేశారు . దీనితో పాటు మట్టి వినాయకులు ముద్దు అను శ్రీశైవతీ ను విడుదల చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరీక్షించి చాలా బాగుంది అని తన సంతృప్తిని వ్యక్తం చేయడంజరిగింది.

శుభకార్యాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

48 గంటల ముందు రూ.2,000 రుసుముతో అనుమతి తీసుకోవాలి

చెత్త సేకరణకు ప్రత్యేక ట్రాలీ ఏర్పాటు.. త్వరలో మరో 10 ఈ-ఆటోలు

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)
నగరంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనే పెళ్లిళ్లు, పుట్టినరోజులు, ఇతర శుభకార్యక్రమాలను నిర్వహించే ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలు, నిర్వాహకులు తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు సూచించారు. కార్యక్రమానికి కనీసం 48 గంటల ముందు రూ.2,000 రుసుము చెల్లించి నగరపాలక సంస్థ నుంచి అనుమతి పొందాలని తెలిపారు.
శుభకార్యక్రమాల సందర్భంగా పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి అవుతున్న నేపథ్యంలో దానిని సక్రమంగా సేకరించేందుకు ప్రత్యేక ట్రాలీని ఏర్పాటు చేయనున్నట్లు కమిషనర్ వెల్లడించారు. అనుమతి, ఇతర పూర్తి వివరాల కోసం 9849908486 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కాలువలో చెత్త వేస్తే చర్యలు

వినాయక ఘాట్ వద్ద కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. అయ్యప్పస్వామి ఆలయం వెనుక టీ దుకాణం వద్ద వ్యర్థాలను కేసీ కెనాల్‌లో వేస్తుండటాన్ని గమనించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువలో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.
అనంతరం గ్రీన్ పార్క్ వద్ద బండ్‌పై నిర్మించిన సీసీ రహదారిని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను తనిఖీ చేసి పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

త్వరలో మరో 10 ఈ-ఆటోలు

వెంకటరమణ కాలనీలోని విశాల్ మార్ట్ వెనుక ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చెత్త సేకరణ ఆటోల పార్కింగ్, చార్జింగ్, చెత్త బదిలీ ప్రదేశాలను కమిషనర్ పరిశీలించారు. ప్రస్తుతం నగరంలో 30 విద్యుత్ ఆటోలు వినియోగంలో ఉన్నాయని, త్వరలో మరో 10 ఈ-ఆటోలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.
ఈ-ఆటోల సంఖ్య పెరగడం ద్వారా నగరంలో చెత్త సేకరణ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. శుభకార్యాలు, ఇతర భారీ కార్యక్రమాల సమయంలో పెద్ద మొత్తంలో చెత్త ఉత్పత్తి అవుతున్నందున నిర్వాహకులు ముందుగానే నగరపాలక సంస్థకు సమాచారం అందించి అనుమతి పొందాలని సూచించారు.కార్యక్రమం జరుగుతున్న సమయంలోనే చెత్తను సేకరించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేస్తే సంబంధిత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర పరిశుభ్రతను కాపాడేందుకు ప్రజలు, ఫంక్షన్‌హాళ్ల యాజమాన్యాలు నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.
కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ ఎం. రఘు, డీఈ నరేష్, శానిటరీ సూపర్‌వైజర్ రమేష్ బాబు, ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, జిలానీ, శివశంకర్, ఫరూక్, వాహనాల ఇన్‌చార్జి కురుబ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

మహా "నంది" శ్వరుడికి ప్రదోషకాల అభిషేకం





మహానంది, సెప్టెంబర్ 8,(రిపబ్లిక్ న్యూస్):
ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలోని మహానందీశ్వర స్వామి గర్భాలయం ఎదురుగా ఉన్న శ్రీ నందీశ్వర స్వామికి , శ్రావణ బహుళ త్రయోదశి ,మహాప్రదోషం సందర్భంగా మంగళవారం ప్రదోష కాలంలో అభిషేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు తదితర బృందం ముందుగా గణపతి పూజ, పీఠార్చన, ద్రవ్య పూజలు చేశారు. నందీశ్వర స్వామికి సుగంధ ద్రవ్యాలతో, పంచామృతం, గంగాజలం, సుగంధ పరిమళ ద్రవ్యాలతో పాటు జలాభిషేకం, పాలాభిషేకం పూజలు జరిపారు. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఆర్జిత సేవా టికెట్ల ద్వారా నందీశ్వర అభిషేకం పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులు నందీశ్వర అభిషేకం తిలకించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. పూజా కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

కరచాలనం

అనంత టీడీపీలో కొత్త చర్చ

దగ్గుపాటి, ప్రభాకర్ చౌదరి కలయికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

అనంతపురం అర్బన్, సెప్టెంబర్ 08,(రిపబ్లిక్ న్యూస్):



ఇంతకాలం రాజకీయంగా దూరంగా కనిపించిన ఇద్దరు నేతలు ఒక్కసారిగా ఎదురుపడి కరచాలనం చేసుకోవడం ఇప్పుడు అనంతపురం టీడీపీలో హాట్‌టాపిక్‌గా మారింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పరస్పరం పలకరించుకుని కరచాలనం చేసుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల లీడర్‌షిప్ కాంక్లేవ్‌కు ఉమ్మడి అనంతపురం జిల్లా టీడీపీ నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ప్రసాద్, ప్రభాకర్ చౌదరి ఎదురుపడగా ఇద్దరూ ఆత్మీయంగా పలకరించుకుని కరచాలనం చేసుకున్నారు.అనంతపురం అర్బన్ రాజకీయాల్లో గతంలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఈ దృశ్యానికి ప్రాధాన్యం ఏర్పడింది. 2024 ఎన్నికల్లో టికెట్ విషయంలో ప్రభాకర్ చౌదరి వర్గంలో అసంతృప్తి వ్యక్తమైనప్పటికీ, ఆ తర్వాత పార్టీ నిర్ణయానికి అనుగుణంగా దగ్గుపాటి ప్రసాద్‌కు మద్దతుగా పనిచేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి.తాజాగా ఇరువురు నేతలు ఒకే వేదికపై పరస్పరం పలకరించుకోవడం పార్టీ శ్రేణుల్లో ఆసక్తిని పెంచింది. ఇటీవల కూడా అనంతపురం అర్బన్ టీడీపీలో ఇరువర్గాల మధ్య రాజకీయ విభేదాలపై చర్చ జరిగిన విషయం తెలిసిందే. కరచాలనం అర్బన్ టీడీపీలో కొత్త సమన్వయానికి సంకేతమా అన్న చర్చ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. దీంతో ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటోలు అనంతపురం టీడీపీ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.రానున్న రోజుల్లో ఇద్దరు నేతల మధ్య రాజకీయ సమన్వయం కొనసాగుతుందా .... పార్టీ కార్యక్రమాల్లో కలిసి కనిపిస్తారా... అన్నది ఆసక్తికరంగా మారింది.

ప్రజా వ్యతిరేక నిర్ణయాల రద్దు కోరుతూ అఖిలపక్షం చేపట్టిన

పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల స్వచ్ఛంద మద్దతు

నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి తాత్కాలిక కలెక్టరేట్‌ను వెంటనే తరలించాలి... నూనెపల్లె మార్కెట్ యార్డు స్థల కేటాయింపును రద్దు చేయాలి.

గాంధీ చౌక్ నుంచి మెయిన్ బజార్ వరకు పోస్టుకార్డు ప్రచారం.. ప్రజా ఒత్తిడికి పదునైన అస్త్రం.

125 ఏళ్ల చరిత్ర గల ఆర్ ఏ ఆర్ ఎస్ ను కాపాడండి... రైతు ప్రయోజనాలను పరిరక్షించండి అఖిలపక్ష ఐక్యవేదిక పిలుపు





నంద్యాల సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

నంద్యాల వ్యవసాయ పరిశోధనా స్థానం ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ కార్యాలయాన్ని వెంటనే తరలించాలని, నూనెపల్లె మార్కెట్ యార్డులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం కోసం కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సమస్యలపై అవగాహన పెంచుకున్న ప్రజలు స్వచ్ఛందంగా ఉద్యమంలో పాల్గొని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేశారు.

సెప్టెంబర్ 2న ప్రారంభమైన ఈ ఉద్యమంలో భాగంగా సెప్టెంబర్ 8న నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి పప్పుల బజారు, రెడ్డి చావడి, సిమెంట్ రోడ్డు మీదుగా మెయిన్ బజార్ వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రజలకు రెండు సమస్యలపై అవగాహన కల్పించగా, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని, ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేస్తూ పోస్టుకార్డులు రాసి పోస్టుబాక్సుల్లో వేశారు.

ఈ సందర్భంగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ, దాదాపు 125 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్ ఏ ఆర్ ఎస్ వ్యవసాయ పరిశోధనలకు కీలకమైన సంస్థ అని తెలిపారు. ముఖ్యంగా విత్తన పరిశోధన, వ్యవసాయ సాంకేతిక అభివృద్ధి, రైతులకు ఉపయోగపడే పరిశోధనలకు ఇలాంటి సంస్థలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అటువంటి పరిశోధనా సంస్థ ప్రాంగణంలో తాత్కాలిక కలెక్టరేట్ ఏర్పాటు చేయడం వల్ల పరిశోధన కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోందని, కలెక్టరేట్‌ను వెంటనే అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు.

అలాగే రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన నూనెపల్లె మార్కెట్ యార్డులో రాజకీయ పార్టీ కార్యాలయం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని అన్నారు. ఈ స్థల కేటాయింపును ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు.

రైతు నష్టపోతే నష్టపోయేది రైతు ఒక్కరే కాదని, రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధిపైనే సమాజ ఆహార భద్రత ఆధారపడి ఉందని నాయకులు స్పష్టం చేశారు. అందువల్ల వ్యవసాయ పరిశోధనా సంస్థలను పరిరక్షించడం, రైతుల ప్రయోజనాల కోసం ఉద్దేశించిన మార్కెట్ యార్డులను కాపాడటం ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు.

ఈ రెండు సమస్యలపై ప్రజా అభిప్రాయాన్ని నేరుగా ప్రభుత్వానికి తెలియజేయడం, ప్రభుత్వంపై ప్రజా ఒత్తిడి పెంచి ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమైన నిర్ణయాలను ఉపసంహరించేలా చేయడం పోస్టుకార్డు ఉద్యమం ప్రధాన లక్ష్యమని అఖిలపక్ష నాయకులు తెలిపారు.

పోస్టుకార్డు ఉద్యమానికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడం, సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వానికి తమ అభిప్రాయాలను తెలియజేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని వారు పేర్కొన్నారు.

అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు ఏర్వ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కో-కన్వీనర్లు ఎజాస్, జానయ్య, చిన్న రామకృష్ణ రెడ్డి, అడ్వకేట్ శంకరయ్య, యర్రం శంకర్ రెడ్డి, విద్యార్థి నాయకుడు రాంబాబు, చౌడప్ప, చింతలయ్య, అడ్వకేట్ నాగేశ్వరరెడ్డి, పట్నం రాముడు, రామ్మోహన్ రెడ్డి, మోహన్ బాబు, షణ్ముఖరావు, మజీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు

రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రిలయన్స్ చేయూత.

అదనపు తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. మురళి

కర్నూలు ప్రతినిధి, సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు రిలయన్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చింది. స్వర్ణ కర్నూలు ప్రగతి మార్గం ప్రాజెక్టులో భాగంగా రిలయన్స్ ఫౌండేషన్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, ఏపీఏఆర్డీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ఇతర వసతుల కల్పనకు భూమిపూజ నిర్వహించారు.

నగరంలోని 23వ వార్డులో ఉన్న సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి, 3వ వార్డులోని బండిమెట్ట శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో పది అదనపు తరగతి గదులతో పాటు బాలబాలికలకు మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు.

విద్యార్థుల సమగ్ర వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాల పరికరాలు, క్రీడా సామగ్రి, చేతులు కడుక్కునే కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా సి.క్యాంప్ నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. మురళి మాట్లాడుతూ.. తమ పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి రిలయన్స్ సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 310 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, భవిష్యత్తులో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. మొదటి అంతస్తులో నిర్మించనున్న నాలుగు అదనపు గదులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. విజ్ఞాన శాస్త్ర పరికరాలు, క్రీడా సామగ్రి, చేతులు కడుక్కునే కేంద్రం వంటి వసతులు అందుబాటు లోకి తీసుకొస్తామన్నారు. అన్ని వసతులు అందుబాటులోకి వల్ల విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల తరఫున రిలయన్స్ ఫౌండేషన్, రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి సహకరించిన మంత్రి టీజీ భరత్ గుప్తా, జిల్లా కలెక్టర్ ఎ. సిరి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. సుధాకర్, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్‌తో పాటు ఉన్నతాధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో రిలయన్స్ ప్లాంట్ మేనేజర్ ఎం.వి. కార్తీక్, మానవ వనరుల విభాగం పీఆర్వో స్ఫూర్తి, ఆర్‌సీపీఎల్ మేనేజర్ కౌశిక్, తిరుపతి రెడ్డి, ఏపీఏఆర్డీ ప్రతినిధులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జి. మురళి, కే. త్యాగరాజు, సీనియర్ ఉపాధ్యాయులు రామశాస్త్రి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్

నాయకత్వంపై అధినేత దిశానిర్దేశం

పాల్గొన్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

స్థానిక ఎన్నికలకు సన్నద్ధతపై ప్రత్యేకంగా ఫోకస్

అనంతపురం ప్రతినిధి , సెప్టెంబర్ 08, (రిపబ్లిక్ న్యూస్):

పార్టీని మరింత బలోపేతం చేయడం ఎలా, ప్రజలకు మరింత చేరువగా వెళ్లేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టాలి.ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లడం ఎలా, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను ఎలా సన్నద్ధం చేయాలి వంటి కీలక అంశాలపై టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో విస్తృతంగా చర్చ జరిగింది. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రెండో రోజు లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్ ఎస్ రాజు పాల్గొన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు.

క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయాలి

పార్టీ సంస్థాగత బలోపేతంతో పాటు ప్రజా సమస్యలపై మరింత సమర్థవంతంగా పనిచేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు, కార్యకర్తల పాత్ర,



క్షేత్రస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయడం వంటి అంశాలపై చంద్రబాబు, లోకేష్ నాయకులకు దిశానిర్దేశం చేశారు. సుస్థిర అభివృద్ధి, మెరుగైన ప్రజాసేవలు, సుపరిపాలన, రాజకీయ కమ్యూనికేషన్ వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. ప్రజలతో పార్టీ నేతలు నిరంతరం అనుసంధానమై ఉండేలా రాజకీయ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని వివరించారు.

సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలి

ఇదే సమయంలో ఎల్‌నినో ప్రభావాలు, దాని కారణంగా ఎదురయ్యే వాతావరణ, వ్యవసాయ, నీటి సంబంధిత సవాళ్లపై కూడా నాయకులకు అవగాహన కల్పించారు. రాబోయే రోజుల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, నాయకత్వ సామర్థ్యాన్ని పెంచుకోవడం, ప్రజలతో మరింత మమేకమై పనిచేయడంపై అధినేత చంద్రబాబు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కాంక్లేవ్ ద్వారా పార్టీ నాయకత్వానికి కొత్త దిశ,





క్షేత్రస్థాయి కార్యకర్తలకు మరింత స్పష్టమైన కార్యాచరణ అందేలా చర్చలు సాగినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో పాటు జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు

పెన్షన్ దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఇబ్బందులు ఉండకూడదు

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా చర్యలు.. వచ్చే వారం రోజులు అత్యంత కీలకం: కలెక్టర్ డా. ఏ.సిరి

కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)



పెన్షన్‌కు అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ప్రక్రియలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టరేట్ నుంచి కొత్త పెన్షన్ దరఖాస్తుల స్వీకరణపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు, డీఆర్‌డీఏ, స్వర్ణ గ్రామస్వర్ణ వార్డు అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియను ప్రతిరోజూ పర్యవేక్షించాలని డీఆర్‌డీఏ పీడీ, జిల్లా స్వర్ణ గ్రామస్వర్ణ వార్డు అధికారులను ఆదేశించారు. రోజువారీ పురోగతి నివేదికను సమర్పించాలని సూచించారు. స్వర్ణ గ్రామస్వర్ణ వార్డు కార్యాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉండి దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయాలని స్పష్టం చేశారు.

మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో పెన్షన్ దరఖాస్తులకు అవసరమైన హౌస్ ట్యాక్స్ డాక్యుమెంట్ల జారీ ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. కార్యాలయాల్లో ప్రజలు ఎక్కువసేపు క్యూలో నిలబడకుండా అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించడంతో పాటు నాలుగు కంప్యూటర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి దరఖాస్తుల స్వీకరణను వేగవంతం చేయాలని సూచించారు.

పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియకు గడువు తక్కువగా ఉన్నందున వచ్చే ఏడు రోజులను అత్యంత ప్రాధాన్యతతో వినియోగించుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హత, అవసరమైన ధ్రువపత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో ముందుగానే తనిఖీ చేయాలని సూచించారు. చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు పరిశీలన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే అర్హులైన వారి జాబితాను ప్రచురించేలా చర్యలు తీసుకోవాలని, ఈ ప్రక్రియను ఆర్డీఓలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ముగ్గురు ఆర్డీఓలతో సమన్వయం చేసుకుని పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని డీఆర్‌డీఏ పీడీకి సూచించారు. అర్హత లేని వ్యక్తులకు ఎట్టి పరిస్థితుల్లోనూ పెన్షన్ మంజూరు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

వైద్య ధ్రువపత్రాలు అదే రోజున ఇవ్వాలి

పెన్షన్ దరఖాస్తుదారులకు అవసరమైన వైద్య ధ్రువపత్రాలను అదే రోజున జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్, డీసీహెచ్ఎస్‌లను కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్ ప్రక్రియలో సాంకేతిక కారణాలతో జాప్యం జరిగే అవకాశం ఉంటే ముందుగా ధ్రువపత్రాన్ని మాన్యువల్‌గా జారీ చేసి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.సాంకేతిక సమస్యలు, సర్టిఫికెట్ల జారీ, దరఖాస్తుల స్వీకరణకు సంబంధించి ఏ సమస్య ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కర్నూలు మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈఓ సుధాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రావు, జిల్లా స్వర్ణ గ్రామస్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, డీఎంహెచ్‌వో డా. కామేశ్వర ప్రసాద్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాధిక, డీసీహెచ్ఎస్ డా. జఫ్రుల్లా, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

యానాదిపల్లిలో శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవం.





రైల్వే కోడూరు సెప్టెంబర్ 8 రిపబ్లిక్ న్యూస్.

రైల్వే కోడూరు నియోజకవర్గం మంగళవారం ఉదయం యానాధిపల్లి గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ గంగమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడుమల్లు సుబ్బరామిరెడ్డి ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి రాయలసీమ జోన్ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్ కుమార్ రెడ్డి రైల్వే కోడూరు న్యూ కృష్ణానగర్ ఎంపీటీసీ నూక మహేశ్వర్ రెడ్డి లు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, పూజారులు వేదమంత్రాలు చదివి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు, ఈ సందర్భంగా భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి పల్లి ఎక్స్ సర్పంచ్ బై శంకర్ రెడ్డి,కౌలూరి సుబ్రహ్మణ్యం రెడ్డి, కౌలూరు శ్రీనివాసరెడ్డి,నూక సురేందర్ రెడ్డి, చింత రెడ్డయ్య రెడ్డి, శ్రీరాములు,శీను, రమణ తదితరులు పాల్గొన్నారు

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No./2023/87888

పోలీసు విచారణకు హాజరైన యూట్యూబర్ నందన.. అద్దంకిలో కూడా మరో కేసు నమోదు

, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :



వీసాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిందన్న ఆరోపణల కేసులో ప్రముఖ యూట్యూబర్ రమానందన చిక్కుల్లో పడింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నమోదైన వీసా చీటింగ్ కేసులో ఆమె తన న్యాయవాదులతో కలిసి పోలీసుల ఎదుట విచారణకు హాజరైంది. విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రమానందన దంపతులు తన వద్ద నుంచి రూ.13 లక్షలు వసూలు చేసి మోసం చేశారని బాధితుడు క్రాంతి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యూకే నుంచి హైదరాబాద్ చేరుకున్న వెంటనే విచారణకు హాజరుకావాలని పోలీసులు నోటీసులు జారీ చేయడంతో ఆమె పీఎస్‌కు వచ్చింది.మరోవైపు, రమానందనపై ప్రకాశం జిల్లా అద్దంకి పోలీస్ స్టేషన్ లో కూడా మరో వీసా స్కామ్ కేసు నమోదు కావడం సంచలనం సృష్టిస్తోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ' పేరిట వీసా రెన్యువల్, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని నమ్మించి 2023లో తమ వద్ద భారీగా డబ్బులు వసూలు చేసి మోసం చేశారని బాధితులు పోలీసులను ఆశ్రయించారు. వరుస కేసులు నమోదవ్వడంతో బాధితులను ఇబ్రహీంపట్నం పీఎస్‌కే రావాలని రమానందన కోరినట్లు సమాచారం. దీంతో హైదరాబాద్‌తో పాటు అద్దంకికి చెందిన బాధితులు కూడా భారీగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చేరుకుంటున్నారు.

ఇండోనేషియాలో బద్దలైన అగ్నిపర్వతం.


, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :



ఇండోనేషియాలోని సుప్రసిద్ధ అనక్ క్రాకటోవా అగ్నిపర్వతం బద్దలవడం తెలిసిందే. సుమారు 25 గంటల పాటు నిరంతరాయంగా లావా, బూడిద వెదజల్లడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ విస్ఫోటనం కారణంగా ఆకాశమంతా దట్టమైన బూడిద మేఘాలు అలుముకోవడంతో రవాణా వ్యవస్థ, ముఖ్యంగా విమాన సర్వీసులు పూర్తిగా స్తంభించిపోయాయి. ఈ అగ్నిపర్వతం 24 గంటల పాటు ఏకధాటిగా లావాను వెలిగక్కింది. ఈ విస్ఫోటానికి సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆకాశంలో దట్టమైన బూడిద వ్యాపించడంతో ముందుజాగ్రత్త చర్యగా జకార్తాలోని సోకర్నో-హట్టా, హలిమ్ పెర్దనకుసుమ అంతర్జాతీయ విమానాశ్రయాలతో సహా మొత్తం 8 ఎయిర్‌పోర్టులను తాత్కాలికంగా మూసివేశారు.ఈ నిర్ణయంతో సుమారు 2,300 విమాన సర్వీసులు రద్దు లేదా దారి మళ్లించారు. దీనివల్ల దాదాపు 2.70 లక్షల మంది ప్రయాణికులు విమానాశ్రయాల్లోనే చిక్కుకుపోయారు. ఇండోనేషియా జియోలాజికల్ ఏజెన్సీ లెవెల్-3 (హై అలర్ట్) హెచ్చరికను జారీ చేసింది. స్థానికంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విస్ఫోటనాలు సంభవించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు.అయితే, ఈ విస్ఫోటనం వల్ల సునామీ ప్రమాదం ఏమీ లేదని అధికారులు స్పష్టం చేయడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 2018లో ఇదే అగ్నిపర్వతం బద్దలైనప్పుడు సంభవించిన సునామీ కారణంగా సుమారు 430 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రస్తుతానికి బూడిద, విష వాయువులు, వేడి రాళ్ల ముప్పు మాత్రమే ఉందని తెలిపారు. పరిస్థితి వేగంగా మారుతున్నందున విమానాశ్రయాల పునఃప్రారంభంపై ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని రవాణా శాఖ మంత్రి దుదీ పుర్వగంధీ పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు తమ విమానయాన సంస్థలను సంప్రదించాలని సూచించారు. పసిఫిక్ 'రింగ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉండటంతో ఇండోనేషియాలో తరచూ ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తుంటాయి.

తెలంగాణ పోలీసు ఉద్యోగ అభ్యర్థులకు దరఖాస్తు గడువు పెంపు

ఎప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :



తెలంగాణలో పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) కీలక ప్రకటన చేసింది. కానిస్టేబుల్ స్థాయి పోస్టుల దరఖాస్తు గడువును పొడిగిస్తున్నట్లు బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 9వ తేదీతో ఈ గడువు ముగియాల్సి ఉండగా, అభ్యర్థుల సౌకర్యార్థం సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అవకాశం కల్పించింది.రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 7,437 పోస్టుల భర్తీ కోసం టీఎస్ఎల్‌పీఆర్‌బీ జూలై 29న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందులో సివిల్ కానిస్టేబుల్ (3,697), ఏఆర్ కానిస్టేబుల్ (1,052), స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్ (1,380), ఫైర్ ఫైటర్ (751), జైల్ వార్డర్ (208), ఎస్ఏఆర్ సీపీఎల్ (24) పోస్టులు ఉన్నాయి.
ఈ ఉద్యోగల కోసం ఇప్పటివరకు 3,38,336 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, వారిలో 2,88,530 మంది ఫీజు చెల్లించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేశారు. ఆధార్ వెరిఫికేషన్ సైతం 95 శాతానికి పైగా పూర్తయినట్లు బోర్డు తెలిపింది. గడువు ముగిసే ఆఖరి రోజుల్లో దరఖాస్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, దీనివల్ల సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని బోర్డు పేర్కొంది. కాబట్టి అభ్యర్థులు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీఎస్ఎల్‌పీఆర్‌బీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

నన్నేమైనా అంటే నిజాలు బయటకు వస్తాయి: విజయసాయిరెడ్డి

అమరావతి, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుపై కీలక ప్రకటన చేశారు. దసరా పండుగ ముగిసిన మరుసటి రోజే తన కొత్త పార్టీని ప్రకటిస్తానని వెల్లడించారు. సోమవారం విజయవాడలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీలకు ప్రత్యామ్నాయంగా తన పార్టీ నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.
తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు రెండూ కుటుంబ పార్టీలేనని విజయసాయిరెడ్డి విమర్శించారు. ఒకరు అధికారం కోల్పోతే మరొకరు అధికారంలో ఉండాలని చూస్తున్నారని, ఈ నేపథ్యంలోనే రాష్ట్రానికి మూడో ప్రత్యామ్నాయం అవసరమని తాను భావిస్తున్నానని అన్నారు. తన వెనుక ఎంతమంది ఉన్నారనేది రాబోయే ఆరు నెలల నుంచి ఏడాదిలోపు అందరికీ తెలుస్తుందని చెప్పారు. తాను అమరావతికి వ్యతిరేకం కాదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.
ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీలోని కోటరీ మళ్లీ తనను నమ్మకద్రోహి అంటూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తే, తన దగ్గర ఉన్న అనేక నిజాలను బయటపెట్టాల్సి వస్తుందని అన్నారు.తన పార్టీ కేపీ పాల్ పార్టీలా ఉంటుందని మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై సాయిరెడ్డి ఘాటుగా స్పందించారు. అసలు బొత్స ఎన్ని పార్టీలు మారారో, వైఎస్ మరణం తర్వాత ఎలా మాట్లాడారో గుర్తుచేసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాధనాన్ని దోచుకుని పార్టీ పెడుతున్నారని మంత్రి సత్యకుమార్ చేసిన ఆరోపణలపై బదులిస్తూ.. "నేను ప్రజాధనం దోచుకుంటే నాపై కేసులు పెట్టి అరెస్టు చేయమనండి" అని సవాల్ విసిరారు. తనకు బీజేపీతో మంచి సంబంధాలు ఉన్నాయని, ఆ విషయం బహుశా మంత్రికి తెలియదేమోనని వ్యాఖ్యానించారు.

పెరుగుతున్న సైబర్ మోసాలు

, సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :



నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. "ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం" అని మెటా ప్రతినిధి వివరించారు. "మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం" అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. 'లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ' అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి (పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ "స్పష్టంగా నకిలీ" కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. "వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు" అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను "చివరి ప్రయత్నంగా" డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. "అదే అత్యంత బాధాకరమైన విషయం" అన్నారు ఓలి. "మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది" అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. "ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు" అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. "క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు" అని 'మోర్బిడ్ క్యూరియాసిటీ' పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో 'బ్లూ టిక్' (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. "నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు" అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎదైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

భారత్‌లో ఈవీల జోరు..

ఆగస్టులో ఆల్ టైమ్ రికార్డు అమ్మకాలు



భారత్‌లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) విక్రయాలు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. 2026 ఆగస్టు నెలలో ఈవీ అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయికి చేరాయి. గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 52.9 శాతం వృద్ధితో మొత్తం 2,98,448 యూనిట్ల ఈవీలు అమ్ముడయ్యాయి. దీంతో మొత్తం ఆటోమొబైల్ మార్కెట్‌లో ఈవీల వాటా 9.5 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగింది. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) మంగళవారం గణాంకాలను విడుదల చేసింది.ఫాడా నివేదిక ప్రకారం, ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, ప్యాసింజర్ వాహనాలు, వాణిజ్య వాహనాలు.. ఇలా అన్ని విభాగాల్లోనూ ఆగస్టు నెలలో రికార్డు స్థాయి అమ్మకాలు నమోదవడం విశేషం.

విభాగాల వారీగా అమ్మకాలు ఇలా..

ఎప్పటిలాగే, ఈవీ ద్విచక్ర వాహనాల అమ్మకాలు 67.05 శాతం వృద్ధితో 1,83,204 యూనిట్లకు చేరాయి. ఈ విభాగంలో టీవీఎస్ మోటార్ 48,938 యూనిట్లతో అగ్రస్థానంలో నిలవగా, బజాజ్ ఆటో (41,114), ఏథర్ ఎనర్జీ (28,757) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ప్రముఖ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే 29 శాతం తగ్గి 13,852 యూనిట్లకు పరిమితమయ్యాయి.
ఎలక్ట్రిక్ త్రిచక్ర వాహనాల విక్రయాలు 25.28 శాతం పెరిగి 79,846 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ విభాగంలో బజాజ్ ఆటో (13,833) మొదటి స్థానంలో, మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ (12,806) రెండో స్థానంలో నిలిచాయి. ఇక ప్యాసింజర్ వాహనాల (కార్లు) అమ్మకాలు 51.89% వృద్ధితో 30,696 యూనిట్లకు పెరిగాయి. ఈ సెగ్మెంట్‌లో టాటా మోటార్స్ (13,158), మహీంద్రా అండ్ మహీంద్రా (6,464), జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా (4,622) టాప్-3లో ఉన్నాయి. కొత్తగా మార్కెట్లోకి వచ్చిన విన్‌ఫాస్ట్ 2,199, టెస్లా 116 కార్లను విక్రయించాయి.
అన్నింటికంటే వేగంగా వృద్ధి చెందిన విభాగం ఎలక్ట్రిక్ వాణిజ్య వాహనాలే. గతేడాది ఆగస్టులో కేవలం 1,631 యూనిట్లు అమ్ముడవగా, ఈసారి అమ్మకాలు దాదాపు మూడు రెట్లు పెరిగి 4,702 యూనిట్లకు చేరాయి.

సబ్సిడీలపై ఆధారపడటం లేదు..

ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ మాట్లాడుతూ.. "భారత్‌లో ఎలక్ట్రిక్ మొబిలిటీకి ఆగస్టు నెల చరిత్రాత్మకం. ముఖ్యంగా వాణిజ్య వాహనాల విభాగం పనితీరు అద్భుతం. అవి పైలట్ ప్రాజెక్టుల దశ నుంచి నేరుగా కొనుగోలు ఆర్డర్ల స్థాయికి చేరాయి. ఇప్పుడు ఈవీల అమ్మకాలు కేవలం సబ్సిడీల మీద ఆధారపడి లేవు. నిర్వహణ వ్యయం తగ్గడం, ఛార్జింగ్ సౌకర్యాలు విస్తరించడం, వినియోగదారుల్లో నమ్మకం పెరగడం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. పీఎం ఈ-డ్రైవ్, రాష్ట్రాల విధానాలు కూడా ఇందుకు దోహదపడుతున్నాయి" అని వివరించారు.

కొబ్బరి వ్యర్థాలతో వాటర్ ఫిల్టర్ తయారీ

శాస్త్రవేత్తలకే సాధ్యం కాని సమస్యను ఛేదించిన టీనేజర్..



సముద్రాల్లో పేరుకుపోతున్న మైక్రోప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా తగ్గించాలి? పర్యావరణ శాస్త్రవేత్తలు ఏళ్లుగా పరిష్కారాల కోసం ప్రయత్నిస్తున్నారు. కానీ ఓ హైస్కూల్ విద్యార్థిని మాత్రం సమస్యకు పరిష్కారాన్ని కొబ్బరి పీచులోనే వెతికింది. హవాయిలోని ఈస్ట్ హొనొలులుకు చెందిన వెరా వాంగ్ చేసిన పరిశోధన ఇప్పుడు అంతర్జాతీయంగా ఆసక్తిని రేపుతోంది. కొబ్బరి వ్యర్థాలతో తయారు చేసిన ఫిల్టర్‌తో మైక్రోప్లాస్టిక్స్‌ను పట్టుకోవడమే కాదు.. వాటిని కరిగించగల ఫంగస్‌ను కూడా ఆమె గుర్తించింది.

కొబ్బరి వ్యర్థాలతో ప్రయోగం

కైసర్ హైస్కూల్‌లో చదువుతున్న వెరా.. పదో తరగతిలోనే సముద్ర కాలుష్యంపై దృష్టి పెట్టింది. కొబ్బరి పీచు, ఇతర కొబ్బరి వ్యర్థాలతో ఓ వాటర్ ఫిల్టర్‌ను రూపొందించింది. సంప్రదాయ పాలినేషియన్ అల్లిక పద్ధతుల నుంచి స్ఫూర్తి పొందింది. ఈ ఫిల్టర్ నీటిలో తేలియాడే మైక్రోప్లాస్టిక్స్, సన్‌స్క్రీన్ రసాయనాలను సమర్థంగా పట్టుకున్నట్లు గుర్తించింది.

అసలు సీక్రెట్ ఫంగస్‌లోనే!

వ్యర్థాలను పట్టుకోవడం మాత్రమే సరిపోదని వెరా భావించింది. ఫిల్టర్‌లో చిక్కుకున్న వ్యర్థాలను పూర్తిగా తొలగించే మార్గంపై పరిశోధన మొదలుపెట్టింది. కొబ్బరి పీచు రంధ్రాల నిర్మాణం గాలి, నీటి ప్రసరణకు అనుకూలంగా ఉంటుందని గుర్తించింది. దీంతో అందులో ఉండే సూక్ష్మజీవులపై దృష్టి పెట్టింది.
హవాయి యూనివర్సిటీ పరిశోధకులతో కలిసి చేసిన ప్రయోగాల్లో కొబ్బరి తంతువులపై సహజంగా పెరిగే కొన్ని ఫంగస్ జాతులు బయటపడ్డాయి. ఇవి సన్‌స్క్రీన్‌లోని కొన్ని రసాయనాలతో పాటు ప్లాస్టిక్ పదార్థాలను కూడా జీవక్రియ ద్వారా విచ్ఛిన్నం చేయగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు.

సైన్స్‌లో కొత్త జాతుల జాడ!

కొబ్బరి పీచులోని సహజ టానిన్ పదార్థాలు ఈ ఫంగస్ పెరుగుదలకు తోడ్పడుతున్నట్లు ప్రయోగాల్లో తేలింది. అంతేకాదు.. వెరా గుర్తించిన కొన్ని ఫంగస్ జాతుల జన్యు నమూనాలు ప్రపంచంలోని అతిపెద్ద జన్యు డేటాబేస్‌లోని రికార్డులతో సరిపోలలేదు. దీంతో ఇప్పటివరకు శాస్త్రవేత్తలకు తెలియని ఫంగస్ జాతులు కావచ్చనే ఆసక్తికర అంశం వెలుగులోకి వచ్చింది.
ఈ పరిశోధనకు హవాయి స్టేట్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో మైక్రోబయాలజీ విభాగంలో మొదటి బహుమతి దక్కింది. మెక్‌ఇనెర్నీ ఫౌండేషన్ స్కాలర్‌షిప్ కూడా లభించింది. ఈ విజయంతో అంతర్జాతీయ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌కు వెరా ఎంపికైంది.


ఎంబిబిఎస్ సీటు సాధించిన
విద్యార్థినికి ఘన సన్మానం



మల్లాపూర్ సెప్టెంబర్ 8 (రిపబ్లిక్ న్యూస్)

మల్లాపూర్ మండలం రేగుంట గ్రామానికి చెందిన మోతే శ్రీనివాస్-సంజన దంపతుల కుమార్తె హన్సిక ఇటీవల జరిగిన ఎంబిబిఎస్ మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఫలితాల్లో స్టేట్ మెరిట్ ర్యాంక్ సాధించిన సందర్భంగా రేగుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేసారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైద్యురాలిగ ఎదగాలనే లక్ష్యంతో, చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ, క్రమశిక్షణతో, కష్టపడి చదివి సాధించిన మంచి ర్యాంక్ ద్వారా ప్రభుత్వ వైద్య కళాశాలలో సీటు సాధించడం ఆమె ప్రతిభకు నిదర్శనమని, భవిష్యత్తులో మంచి వైద్యురాలిగ ఎదిగి ప్రజలకు సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీట్ల లహరి రాజేష్, కార్యదర్శి వినీత, పాలకవర్గ సభ్యులు కలసాని రాజన్న, కత్తి నరేష్, బాస రాజరెడ్డి, మహమ్మద్ బషీర్, జి.పి.ఒ రాములు, నాయకులు రంగు రామాగౌడ్, సురకంటి తిరుపతి రెడ్డి, బి.ఎల్.ఓ. శోభరాణి, రాజమ్మ, యం.యల్.హెచ్.పి దీప్తి, ఏ.ఎన్ యం. రాధ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2026కు ఎంపికైన
రాయికల్ డా. పడాల తిరుపతికి ఘన సన్మానం







రాయికల్ మండలం సెప్టెంబర్ 08 (రిపబ్లిక్ న్యూస్)

కరీంనగర్ ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, కరీంనగర్‌లో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం2026కు ఎంపికైన కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకులు డా. పడాల తిరుపతిని ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత గౌరవాన్ని అందుకున్న తమ సహచర అధ్యాపకుడిని అభినందిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ తిరుకొవెల శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని డా. పడాల తిరుపతిని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఒక అధ్యాపకుడి ప్రతిభకు, అంకితభావానికి రాష్ట్రస్థాయి గుర్తింపు లభించడం వ్యక్తిగత గౌరవమే కాకుండా కళాశాల మొత్తానికి గర్వకారణమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర ఎంతో కీలకమని, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన డా. పడాల తిరుపతి సేవలు విద్యార్థులకు, సహచర అధ్యాపకులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

వైస్ ప్రిన్సిపాళ్లు నితిన్ పాఠక్, డా. రాజయ్య మాట్లాడుతూ బోధనను కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా, సేవగా భావించి పనిచేస్తున్న అధ్యాపకులకు ఇలాంటి పురస్కారాలు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. డా. పడాల తిరుపతి బోధనతో పాటు విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో చేస్తున్న కృషిని వారు అభినందించారు.

వృక్షశాస్త్ర విభాగాధిపతి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ తిరుకొవెల శ్రీనివాస్ మాట్లాడుతూ డా. పడాల తిరుపతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతో బోధిస్తూ, విద్యార్థి కేంద్రిత కార్యక్రమాలు, పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, సామాజిక అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఆయనకు లభించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం వృక్షశాస్త్ర విభాగానికి, ఎస్.ఆర్.ఆర్. కళాశాలకు ఎంతో గౌరవాన్ని తీసుకువచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధ్యాపకులు డా. ఆర్. రాధాకృష్ణ, డా. ఎం.డి. తెహర్ హుస్సేన్, శ్రీమతి కె.కె. కళాజ్యోతి, డా. అందె బుంగ తిరుపతి, ఎం.డి. తాజుద్దీన్, శ్రీమతి స్వరూపారాణితో పాటు ఇతర విభాగాల అధ్యాపకులు పాల్గొని డా. పడాల తిరుపతికి అభినందనలు తెలిపారు.

యూజీ, పీజీ విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన అధ్యాపకుడికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డా. పడాల తిరుపతి మాట్లాడుతూ తనకు లభించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం తన ఒక్కరి విజయంగా భావించడం లేదని, తన సహచర అధ్యాపకులు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు అందించిన ప్రోత్సాహం, సహకారం ఫలితంగానే ఈ గౌరవం లభించిందని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల విద్యా ప్రగతి, పరిశోధనా నైపుణ్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మరియు సమాజ సేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.కార్యక్రమం సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు మాట్లాడుతూ "డా. పడాల తిరుపతి సాధించిన రాష్ట్రస్థాయి పురస్కారం ఎస్.ఆర్.ఆర్. కళాశాల ప్రతిష్ఠను మరింత పెంచింది. ఆయన బోధనా నిబద్ధత, పరిశోధనా ఆసక్తి, విద్యార్థుల పట్ల చూపుతున్న ఆప్యాయత ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు.బోధనలో అంకితభావం పరిశోధనలో ప్రతిభ విద్యార్థుల అభివృద్ధిలో నిరంతర కృషి రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో గౌరవం డా. పడాల తిరుపతి సాధనకు కళాశాల కుటుంబం హర్షం వ్యక్తం చేసింది.

ఈవీఎంల పరిశీలనలో జగిత్యాల జనసేన నాయకులు బెక్కం జనార్దన్



రాయికల్ మండలం సెప్టెంబర్,8(రిపబ్లిక్ న్యూస్)

జగిత్యాల జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జగిత్యాలలో నిర్వహించిన ఈవీఎం, వీవీప్యాట్‌ల తనిఖీ ప్రక్రియలో జనసేన పార్టీ జగిత్యాల జిల్లా సీనియర్ నాయకుడు బెక్కం జనార్దన్ పాల్గొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది సమక్షంలో ఈవీఎంల పనితీరు, సాంకేతిక పరిస్థితిని నిబంధనల మేరకు పరిశీలించారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడేందుకు చేపట్టే ఈ తనిఖీలను పర్యవేక్షించినట్లు బెక్కం జనార్దన్ తెలిపారు. ప్రజల ఓటు హక్కు, ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం నిలబెట్టేలా అన్ని చర్యలు పారదర్శకంగా కొనసాగాలని ఆయన కోరారు.

రాయికల్ మండల పట్టణ బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్





రాయికల్ మండలం సెప్టెంబర్,08(రిపబ్లిక్ న్యూస్)

కాంగ్రెస్ ప్రభుత్వం నిన్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే లను ఎంఎల్సీలను అక్రమంగా అసెంబ్లీ కు రానియ్యకుండా పోలీసు లను పెట్టి అక్రమంగా అడ్డుకున్న నేపథ్యం లో బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునియ్యగ జగిత్యాల జిల్లా రాయికల్ పోలీసులు బీఆర్ఎస్ మండల మరియు పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్ , ఎలిగేటి అనిల్ , మండల& పట్టణ కో అర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి నాయకులు కొయ్యాడి మహిపాల్ రెడ్డి, జకిలే టి హరీష్ రావు, మహేష్ గౌడ్ లను ముందస్తు అరెస్ట్ చేశారు..

జగన్నాథ్ పూర్ గ్రామంలో
నిత్యం మంచినీటి కష్టాలు..!
స్పందించని సిబ్బంది విధులకు డుమ్మా -?





రాయికల్ మండలం సెప్టెంబర్,08(రిపబ్లిక్ న్యూస్)

గిరిజనులకు ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన అది గిరిజనులకు చేరేవరకు గ్రామపంచాయతీ సిబ్బంది అలసత్వం వల్ల గ్రామాలకు చేరే లేకపోతున్నాయి అత్యవసర సమస్యలపై కూడా అధికార గ్రామ పాలన సిబ్బంది స్పందించడం లేదని ఆరోపణ జగిత్యాల జిల్లా రాయికల్ మండలం జగన్నాథ్ పూర్ పంచాయతీ సెక్రటరీ అందుబాటులో లేకపోవడం గ్రామ సర్పంచ్ సమస్యలు పట్టించుకోకపోవడం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా శాశ్వత పరిష్కారం లేదని ప్రజల ఆవేదన.ప్రభుత్వం నిధులు ఇస్తే... మా గ్రామానికి తాగునీరు ఎందుకు రావడం లేదు?పంచాయతీకి నిధులు వస్తున్నాయంటే తాగునీటి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదు?అని గ్రామస్తుల వాదన.పెద్ద నీళ్ల బాయి ఉన్నా గ్రామస్తులకు సరైన నీటి సరఫరా లేదు.తరచూ మొరాయిస్తున్న మోటార్లు వెంటనే కొత్త మోటార్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.జగన్నాథ్ పూర్.గ్రామ ప్రజలు కోరుతున్నారు

ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం బూటకమని ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని రాయికల్ కలగిరి గంగారెడ్డి ఆరోపణ

రాయికల్ మండలం సెప్టెంబర్,08(రిపబ్లిక్ న్యూస్)

ప్రభుత్వ ఖర్చుతో ప్రజలకు సేవ చేసేందుకు ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు కానీ ఆటు ప్రజావాణితో ప్రజలకు ఒరిగిందేమీ లేదని ప్రజాదానాన్ని ఖర్చుపెట్టి ఏలాంటి పనులు చేయకుండా వినతి పత్రాలు తీసుకోవడం మాత్రం ముఖ్యమైనదని కానీ వాటి అమలు చేయడంలో జిల్లా యంత్రాంగం మండల యంత్రాంగం అధికారులు ఎలాంటి పనులు చేయడం లేదని ప్రజల మధ్య పెట్టేందుకు ఇది ఒక నాటకం అని జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణ కాలగిరి గంగారెడ్డి ఆరోపిస్తున్నారు మీరు గతంలో పల్లికొండ భీమయ్య వద్ద సర్వేనెంబర్ 10 75 / 9లో గల 293 గజాల 11 పైసలు భూమి తీసుకున్నాను అట్టి భూమి అధికారుల ద్వారా కట్కం రాజేశం కు బినామీ బోగస్ పేపర్లతో అప్పటి తాసిల్దార్ రిజిస్ట్రేషన్ చేశాడని ఈ విషయంలో హైదరాబాద్ ప్రజావాణిలో కరీంనగర్ రాయికల్ జగిత్యాల్ ప్రజావాణిలో పలుమార్లు వినతిపత్రం ఇవ్వడం దానిపై ఎలాంటి యాక్షన్ తీసుకోవడం లేదు మరి ఎందుకు ఈ ప్రజావాణి ప్రజలకు ప్రజావాణి ద్వారా వెంటనే పనులు జరుగుతాయని ప్రజావాణి కి వెళ్తే అక్కడ ఏళ్ల తరబడి





తిరిగిన పనులు మాత్రం కావడం లేదు ప్రభుత్వం ప్రజలను మోసం చేయడం ఇదేనా!!

ఇక ప్రజా ప్రతినిధుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ అధికారుల వాతీ పట్టు కోల్పోయినట్టు పూర్తిగా కనిపిస్తుందని ఆయన ఆరోపించారు వాస్తవానికి ప్రజలకు న్యాయం చేయాలి కానీ ఏళ్ల తరబడి ప్రజావాణిలో చుట్టు తిరగడమేనా ఇలా ఎంతోమంది పనులు కాక ప్రజావాణి ల వెంబటి తిరిగి వాళ్లు చెప్పులు మాత్రమే అరుగుతున్నాయని కాలగిరి గంగారెడ్డి ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా ప్రజాప్రతినిదులు కల్పించుకొని ప్రభుత్వ యంత్రాంగాన్ని గాడిలో పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉంది సమస్యలు తీరాలంటే అధికారులు పనిచేయాలి కానీ అధికారులు పనిచేయకుండా ప్రజా ప్రతినిధి ఎన్ని చెప్పినా ఫలితం మాత్రమే శూన్యమే అని ఆరోపిస్తున్నారు

ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఘన స్వాగతం



అనంతపురం సంక్షేమం, సెప్టెంబర్ 08, (రిపబ్లిక్ న్యూస్):

ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ తెగల రాష్ట్ర కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి, కమిషన్ సభ్యులు పి. వెంకటప్ప, కె. మల్లేశ్వరరావు అనంతపురం జిల్లా పర్యటనకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. పుట్టపర్తి నుంచి రోడ్డు మార్గంలో అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకోగా అనంతపురం ఆర్డీవో ప్రేమంత కుమార్ పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, పుట్టపర్తి డీటీడబ్ల్యూఓ మోహన్ రామ్, అనంతపురం అర్బన్ తహసీల్దార్ డి. రాజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తేజ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సాకే ముసలయ్యతో పాటు బీజేపీ జోనల్ నాయకుడు రంజిత్ నాయక్, పామిడి, గార్లదిన్నె, ఉరవకొండ మండలాల నాయకులు చౌహాన్ అంజి నాయక్, చాణిక్య, కేశవ నాయక్, రవీంద్ర నాయక్, మురళి, అజయ్, యశ్వంత్ తదితరులు కమిషన్ చైర్మన్, సభ్యులను కలిసి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

కమిషన్ చైర్మన్ బుధవారం జిల్లాలో విస్తృతంగా పర్యటించనున్నారు. అనంతపురం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఉదయం గిరిజన నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, గిరిజన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. అనంతరం నగరంలోని ఏకలవ్య విగ్రహం వద్దకు చేరుకుని పుష్పాంజలి ఘటించనున్నారు.

తరువాత పామిడి మండలం పాలెం తండా లో మధ్యాహ్నం గిరిజన ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకోనున్నారు. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రజల నుంచి వివరాలు స్వీకరించనున్నారు. తిరిగి అనంతపురం కలెక్టరేట్ లో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జిల్లా కలెక్టర్, ఎస్పీతో పాటు జిల్లా స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.



శాంతమ్మ మృతికి గుండుమల తిప్పేస్వామి సంతాపం

గుడ్డంపల్లికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు- కుటుంబ సభ్యులకు పరామర్శ

మడకశిర క్రైమ్, సెప్టెంబర్ 08, (రిపబ్లిక్ న్యూస్):

మండలంలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన అడ్వకేట్ భాస్కర్ తల్లి శాంతమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతి విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి గుడ్డంపల్లి గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా శాంతమ్మ భౌతికకాయానికి గుండుమల తిప్పేస్వామి నివాళులర్పించారు. అనంతరం ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనంతరం అడ్వకేట్ భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శాంతమ్మ మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.గ్రామంలో శాంతమ్మ మృతి విషయం తెలుసుకున్న గుండుమల కుటుంబ సభ్యులను పరామర్శించారు. శాంతమ్మ మృతితో గుడ్డంపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్ పుల్లయ్య చౌదరి, అడ్వకేట్ పుట్టకామప్ప, కాంట్రాక్టర్ లక్ష్మీనరసప్ప, రాజశేఖర్ తదితరులు పాల్గొని శాంతమ్మ భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.



జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

నిరక్షరాస్యత నిర్మూలనకు సమిష్టి కృషి చేయాలి

అక్షరజ్ఞానంతో ఆత్మగౌరవం, సాధికారత సాధ్యం

మహిళలు సహా ప్రతి ఒక్కరూ అక్షరాస్యులుగా మారాలి

జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా



నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 08 (రిపబ్లిక్ న్యూస్)

జిల్లాలో 100 శాతం నిరక్షరాస్యతను నిర్మూలించి ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అధికారులు, వాలంటీర్లు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో నిర్వహించిన 60వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 100 శాతం అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు సమిష్టి కృషితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అక్షరజ్ఞానం కేవలం చదవడం, రాయడం నేర్చుకోవడం మాత్రమే కాదని, అది వ్యక్తిలో ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, సాధికారతను పెంపొందించి మెరుగైన జీవనానికి బాటలు వేస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎవరూ విద్యకు దూరంగా ఉండకుండా, చదువులో వెనుకబడిన ప్రతి ఒక్కరూ అక్షరజ్ఞానం పొందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సర్వే ద్వారా జిల్లాలో సుమారు 3.50 లక్షల మంది నిరక్షరాస్యులను గుర్తించామని, వారందరినీ మూడు సంవత్సరాల కాలంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో “ఉల్లాస్” (అక్షరాంధ్ర) కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. గత ఏడాది నిర్వహించిన ఫేజ్-1లో లక్ష మందికి పైగా అభ్యాసకులకు అక్షరాస్యత అందించే లక్ష్యాన్ని విజయవంతంగా సాధించామని పేర్కొన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని “అక్షరాంధ్ర ఫేజ్-2”ను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ దశలో సుమారు 1.12 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా పెట్టుకున్నామని, మిగిలిన లక్ష్యాన్ని వచ్చే ఏడాది ఫేజ్-3లో పూర్తి చేసి జిల్లాను 100 శాతం అక్షరాస్యత సాధించిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ముందుగా అక్షరాలను గుర్తించడం, బోర్డులు, బస్సుల పేర్లు చదవడం వంటి ప్రాథమిక నైపుణ్యాలను అలవర్చుకోవడంతో చదవడం, రాయడంపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. కేవలం సంతకం చేయడం వరకు పరిమితం కాకుండా అక్షరాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో బ్యాంకు ఫారాలు నింపడం, ఏటీఎం ద్వారా నగదు తీసుకోవడం, యూపీఐ చెల్లింపులు, మొబైల్ ద్వారా ఆర్థిక లావాదేవీలు నిర్వహించడం వంటి దైనందిన అవసరాలకు ప్రాథమిక అక్షరాస్యత ఎంతో అవసరమని తెలిపారు. అక్షరజ్ఞానం లేకపోవడం వల్ల ఎవరూ మోసపోకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరికీ కనీస అక్షరాస్యత కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా సంఘాల్లోని చదువుకున్న సభ్యులు, ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న చదువుకున్న వారిని వాలంటీర్లుగా ఎంపిక చేసి అభ్యాసకులకు బోధన అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాలంటీర్లకు 8 పాఠాలతో కూడిన పుస్తకాలను అందించడంతో పాటు అభ్యాసకుల కోసం 32 సాధన పత్రాలు, 4 మోడల్ ప్రశ్నపత్రాలను రూపొందించినట్లు చెప్పారు. పగటిపూట పనులకు వెళ్లే వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనుకూలమైన సమయంలో రోజుకు అరగంట నుంచి గంట వరకు బోధన అందించాలని సూచించారు. వచ్చే మార్చిలో నిర్వహించే తుది పరీక్షలకు అభ్యాసకులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని, పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు బొమ్మలు-అక్షరాలను జత చేయడం, సరళమైన కూడికలు, తీసివేతలు వంటి సులభమైన పద్ధతుల్లో అభ్యాసం కల్పించాలని తెలిపారు. డిజిటల్ హాజరు నమోదు కోసం ప్రత్యేక యాప్‌ను వినియోగించాలని సూచించారు. నేర్చుకోవాలనే తపన, ఆసక్తి ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని, పిల్లలను చూసి తల్లిదండ్రులు, తోటివారిని చూసి ఇతరులు స్ఫూర్తి పొంది చదువుకున్న అనేక ఉదాహరణలు ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి “ప్రతి వ్యక్తి అక్షరాస్యుడు – ప్రతి కుటుంబం అక్షరాస్య కుటుంబం” అనే లక్ష్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తున్న అధికారులు, సిబ్బంది, వాలంటీర్లు, టీమ్ సభ్యులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన బృందాలకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ రెడ్డి, డీఈఓ జనార్దన్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, డీఎల్‌డీఓ శివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీపీఓ ఫణికుమార్ నాయక్ తదితర అధికారులు పాల్గొని అక్షరాస్యత ప్రాముఖ్యతను వివరించారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలి

పింఛన్ దరఖాస్తు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

దరఖాస్తుదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్ రాజకుమారి గణియా





నంద్యాల బ్యూరో, సెప్టెంబరు 08 (రిపబ్లిక్ న్యూస్)

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సులభంగా, పారదర్శకంగా, సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని అయ్యలూరు మెట్ట 1, 2 స్వర్ణ వార్డులను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే విధానాన్ని స్వయంగా పరిశీలించి, దరఖాస్తుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఒక్కో దరఖాస్తు ప్రక్రియకు పడుతున్న సమయం, దరఖాస్తుకు అవసరమైన పత్రాలు, అర్హత ప్రమాణాలు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ కోసం వచ్చే వృద్ధులు, ఇతర లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కూర్చునేందుకు కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ పథకం ప్రయోజనం అందేలా సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

రాయలసీమలో మొదటిసారిగా నంద్యాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో

మోకాలు కీళ్ల మార్పిడి

శస్త్ర చికిత్స చేసిన నంద్యాల జీ.ఎస్.ఆర్.ఆసుపత్రి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ రఫీ,డాక్టర్ గుంటి శ్రీకాంత్, మత్తు వైద్యులు డాక్టర్ మధు సూధన రెడ్డి


. ఎ .ఐ.(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత జర్మన్ సాంకేతిక సహకారంతో. ఈ పద్ధతి శస్త్ర చికిత్సలో ప్రయోజనాలు:

కచ్చితత్వం,త్వరితగతిన కోలుకోవడం, మెరుగైన కీళ్ల పనితీరు

. అధునాతన ఏఐ(కృత్రిమ మేధ) విధానంలో కీళ్ల శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించిన డాక్టర్ రవి కృష్ణ , ఐఎంఏ నంద్యాల వైద్యులు.

నంద్యాల సెప్టెంబర్ 8(రిపబ్లిక్ న్యూస్) :

స్థానిక పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న జీ ఎస్.ఆర్. హాస్పిటల్‌లో 70 ఏళ్ల మహిళకు అధునాతన కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సహకారంతో జర్మన్ టెక్నాలజీతో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం గా నిర్వహించారు. ఈ శస్త్రచికిత్సను జీఎస్ఆర్ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్లు డా. మహమ్మద్ రఫీ మరియు డా. గుంటి శ్రీకాంత్ నిర్వహించగా, అనస్థీషియాను సీనియర్ అనస్థీషియా వైద్యులు డా. మధుసూదన్ రెడ్డి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్సలో జర్మన్ ఇంజినీరింగ్‌తో రూపొందించిన ఇంటెలిజెన్నియా రోబోటిక్-సహాయక మోకాలి మార్పిడి వ్యవస్థను వినియోగించారనీ, ఈ కృత్రిమ మేధ) వినియోగంతో శస్త్రచికిత్సలో కచ్చితత్వాన్ని పెంచడంతో పాటు, ఇంప్లాంట్ అమరికను మెరుగుపరచడం మరియు సాంప్రదాయ పద్ధతులతో పోలిస్తే వేగవంతంగా కోలుకోవడానికి తోడ్పడుతుందన్నారు.దీర్ఘకాలిక కీళ్ల పనితీరు మెరుగుపడుతుందని అన్నారు.ఇటువంటి అధునాతన ూ× ఆధారిత మోకాలి మార్పిడి శస్త్రచికిత్స రాయలసీమ ప్రాంతంలో నిర్వహించడం మొదటి సారి కావడం విశేషం అన్నారు. జి ఎస్ ఆర్ ఆసుపత్రి ఆర్థోపెడిక్ సేవల్లో ఈ శస్త్ర చికిత్స ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. శస్త్రచికిత్సలో వినియోగించిన మోకాలి ప్రొస్థెసిస్‌ను ప్రముఖ ఆర్థోపెడిక్ ఇంప్లాంట్ తయారీ సంస్థ మెరిల్ అందించిందనీ. ఈ ప్రక్రియలో మెరిల్ కంపెనీ ప్రతినిధులు నరేష్, రఘు, బాలు సాంకేతిక సహకారం అందించారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకుంటున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతలను అందుబాటులోకి తెచ్చి, ప్రపంచస్థాయి ఆర్థోపెడిక్ చికిత్సను రోగులకు అందించేందుకు ముందుకు వచ్చిన జీఎస్ఆర్ హాస్పిటల్ వైద్య బృందాన్ని ఐ ఎమ్ ఏ కేంద్ర కమిటీ సభ్యులు,రాష్ట్ర మాజీ అధ్యక్షులు, లయన్స్ సేవా సంస్థ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన రావు, నంద్యాల అనస్థీసియా వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ మధుసూధన రెడ్డి, రాష్ట్ర ఐ ఎమ్ ఏ సంయుక్త కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డి అభినందించారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో మోకాలు కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ మహమ్మద్ రఫీ బృందం.

ఉత్తమ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 8,(రిపబ్లిక్ న్యూస్):-

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం. హాజీ బాషాను విద్యాశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. మంగళ వారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సయ్యద్ అబ్దుర్ రాఫీ, స్థానిక మండల విద్యాశాఖ అధికారిణి ఆర్. యశోద పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... డాక్టర్ హాజీ బాషా విద్యారంగానికి చేస్తున్న విశిష్ట సేవలను గుర్తించి జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ సేవ పురస్కారం అందజేయడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. విద్యార్థుల అభ్యున్నతి కోసం ఆయన పడుతున్న శ్రమను వారు కొనియాడారు. ఆయనకు ఈ అవార్డు రావడం మండల విద్యాశాఖకే గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం ఆయనను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు పోషణ్ మాసం 2026 కార్యక్రమాలు

: జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా





నంద్యాల, సెప్టెంబర్ 08 (రిపబ్లిక్ న్యూస్)

రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు నిర్వహిస్తున్న 9వ జాతీయ “పోషణ్ మాసం2026” కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలనీ జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ నందు “మన అంగన్వాడీ మన బాధ్యత” అనే ప్రధాన థీమ్ పై జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ పి డి లీలావతి దేవి, సంబంధిత అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..“మన అంగన్వాడీ మన బాధ్యత” అనే ప్రధాన థీమ్ కార్యక్రమాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించడం, ఆరోగ్య పరిరక్షణ, సమతుల్య ఆహారం, బాలల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, స్థానికంగా లభించే పోషకాహార పదార్థాలతో వంటకాల ప్రదర్శనలు

అంగన్వాడీ కేంద్రాల్లో తాజా, వేడి మరియు సమతుల్య ఆహారంపై అవగాహన

కమ్యూనిటీ టేస్ట్ టెస్టింగ్ కార్యక్రమాలు,అంగన్వాడీ మేనేజ్‌మెంట్ కమిటీలు, గ్రామసభలు, సోషల్ ఆడిట్ ద్వారా ప్రజల భాగస్వామ్యం03 సంవత్సరాల పిల్లల ఎదుగుదల, అభివృద్ధి పర్యవేక్షణ చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు, ఈ సి సిఈ కార్యక్రమాల నిర్వహణ.

ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పిఎం ఎం వి వై)పై అవగాహన, అర్హులైన లబ్ధిదారుల నమోదు. పోషణ వాటికల సందర్శనలు, పోషణ్ మేళాలు, ప్రజలకు ఆచరణాత్మక అవగాహన కార్యక్రమాలుఆరోగ్య, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయం, ఉద్యానవన, ఎస్ ఈఆర్ పి తదితర శాఖల సమన్వయంతో కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాల వివరాలను జన్ ఆందోళన్ డ్యాష్‌బోర్డ్, పోషణ్ ట్రాకర్ ద్వారా నమోదు చేయనున్నారు. జిల్లాలోని ప్రజలు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని “మన అంగన్వాడీ మన బాధ్యత” అనే స్ఫూర్తితో పోషణ్ మాసం కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు.

నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్‌తో సైబర్ మోసాలు

హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేరుతో నకిలీ యాప్స్, ఏపీకే ఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ సెప్టెంబర్ 8)



సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్‌లలో హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ పేరుతో లేదా ఆ సంస్థ లోగోను ఉపయోగించి ప్రచారం చేస్తున్న నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్స్, ఏపీకే ఫైల్స్ లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు.

సైబర్ నేరగాళ్లు తొలుత బాధితులతో చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టించి, నకిలీ యాప్‌లో భారీ లాభాలు వచ్చినట్లు చూపిస్తున్నారని ఎస్పీ తెలిపారు. అనంతరం కొంత మొత్తాన్ని ఉపసంహరించుకునే అవకాశం కల్పించి బాధితుల్లో నమ్మకాన్ని పెంచుతున్నారని చెప్పారు.

ఆ తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టేలా ప్రలోభపెట్టి, డబ్బును ఉపసంహరించుకోవాలంటే ట్యాక్స్, ఛార్జీలు, ఇతర కారణాల పేరుతో అదనంగా డబ్బు చెల్లించాలని కోరుతూ మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు.సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా వచ్చే అనుమానాస్పద ఇన్వెస్ట్‌మెంట్ లింకులను క్లిక్ చేయవద్దని, గుర్తుతెలియని ఏపీకే ఫైల్స్ లేదా యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దని ఎస్పీ సూచించారు. ఏదైనా ఇన్వెస్ట్‌మెంట్ యాప్ అధికారికమైనదో కాదో ముందుగా నిర్ధారించుకోవడంతో పాటు, సంబంధిత సంస్థకు ఉన్న సెబి రిజిస్ట్రేషన్ వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని తెలిపారు.అధిక లాభాలు, గ్యారంటీడ్ రిటర్న్స్ ఇస్తామని చెప్పేవారిని నమ్మవద్దని, పెట్టుబడి పెట్టే ముందు పూర్తి వివరాలను పరిశీలించి, అవగాహనతో నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930కు కాల్ చేయాలని, అలాగే ఎఎఎవతీఎతీఅఎవ.స్ర్తశీజ.అఅ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ తెలిపారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com